1

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

శుక్రవారం | మార్చి 15, 2024 | www.navatelangana.com

జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారిగా అంబాజీ

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారిగా అంబాజీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇంతవరకు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారిని రజిత ఇంచార్జ్ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారినిగా పనిచేశారు. నిర్మల్ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారిగా పనిచేసిన అంబాజీ బదిలీపై ఇక్కడికి వచ్చారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.



కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన అధికారి

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా దవలాపూర్ శ్రీనివాస్ రెడ్డి గురువారం పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ను మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. కొంతకాలంగా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా వెయిటింగ్‌లో ఉన్న అయనను రాష్ట్ర ప్రభుత్వం గురువారం నాడు అదనపు కలెక్టర్ గా కామారెడ్డికి నియమించింది. గతంలో ఇక్కడ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా పని చేసిన మను చౌదరి జిల్లా కలెక్టర్‌గా పదోన్నతి పై సిద్దిపేట జిల్లాకు వెళ్లిన విషయం విధితమే.



కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న అదనపు కలెక్టర్

కోతలకు వేళాయే..
కొనుగోలు కేంద్రాలు లేవాయే

- వర్నిలో ముందస్తుగా చేతికొచ్చిన వరి
- కొనుగోలు కేంద్రాలు లేక దళారుల రంగ ప్రవేశం
- కేంద్రాలు ఏర్పాటు చేస్తే మద్దతు ధర వచ్చే అవకాశం
- క్వింటాకు రూ.500 బోనస్ అమలయ్యేనా..?

నవతెలంగాణ-వర్ని

రాష్ట్రంలోనే ముందస్తుగా వరి పంట చేతికొచ్చేది నిజామాబాద్ జిల్లాలోని ఉమ్మడి వర్నితో పాటు పరిసర ప్రాంతాలు. తాజాగా పంట చేతికి వచ్చి కోతలు ప్రారంభం కాగా.. కొనుగోలు కేంద్రాల జాడ లేదు. దీన్ని అదునుగా భావించిన ప్రయివేటు వ్యాపారులు రంగ ప్రవేశం చేసి అందిన కాడికి దండుకుంటున్నారు. గతంలో కొనుగోలు కేంద్రాలు సకాలంలో ప్రారంభించినా.. తాజాగా ఇంకా కొనుగోలు కేంద్రాలపై అధికారిక యంత్రాంగం ఎలాంటి చర్యలు చేపట్టలేదని రైతులు వాపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వరి ధాన్యానికి క్వింటాకు రూ. 500 బోనస్ ప్రకటించిన నేపథ్యంలో రబీ పంటలకు అమలు చేస్తారా అని రైతులు ఎదురుచూస్తున్నారు.



ధాన్యం కొనుగోలు చేసి తరలిస్తున్న వ్యాపారులు



మమ్మరంగా సాగుతున్న వరి కోతలు

కోత కోస్తున్నారు.. అమ్ముకొంటున్నారు

వరి పంట చేతికి రావటంతో వర్ని మండలంలో గత వారం రోజుల నుంచి ఆంధ్ర, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి దళారులు, కోత మిషన్‌లు కూడా వచ్చాయి. చందూర్, ఘన్‌పూర్, గోవూర్ గ్రామాలలో కోతలు చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలపై స్పష్టత లేకపోవడంతో రైతులు దళారుల వైపు మొగ్గు చూపక తప్పడం లేదు. ఎక్కువ శాతం దళారులకే ధాన్యం అమ్ముకునే పరిస్థితి ఏర్పడింది. పచ్చి ధాన్యాన్ని దళారులు కొనుగోలు చేయడానికి రైతులతో ముందస్తుగా ధరలు ఫిక్స్ చేసుకుంటున్నారు.

సకాలంలో ఏర్పాటు చేసేనా..?

గతంలో కొనుగోలు కేంద్రాలను జిల్లాలో ముందుగా వర్ని మండలం నుంచి ప్రారంభమయ్యేవి. ఇక్కడ వ్యవసాయ శాఖ మంత్రిగా, స్పీకర్‌గా పనిచేసిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి వర్ని, బాన్సువాడ నియోజకవర్గంలో ముందస్తుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేలా చొరవ చూపేవారు. వరి ధాన్యం గ్రేడ్ 'ఏ' కు రూ.2202, బి గ్రేడ్‌కు రూ.2180 ధర నిర్ణయించారు. ఈ యాసంగి పంట ధాన్యం దళారులు 1800 నుంచి 2000 రూపాయలకు కొనుగోలు చేస్తూ రైతులను లూటీ చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ఇదే ఆసరాగా చేసుకొని రైతులతో పచ్చిధాన్యానికి తక్కువ ధర పెట్టి ఇతర ప్రాంతాలకు ధాన్యం తరలించే ప్రయత్నంలో ఉన్నారు.

బోనస్ అమలు అయ్యేనా..?

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో వరి పంటకు క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించింది. ఈ యాసంగి పంట నుంచి అమలు చేస్తదా అని రైతులు ఎదురుచూస్తున్నారు. సొసైటీల ద్వారా, ఐకెపి కేంద్రాల ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందా? లేదా? అని అనుమానం రైతులలో ఉంది. ఎండిన ధాన్యానికి పచ్చి ధాన్యానికి కూడా కాంగ్రెస్ ప్రభుత్వం మంచి గిట్టుబాటు ధరను ఇస్తామని అసెంబ్లీ ఎన్నికల వేల హామీ ఇచ్చారు. ప్రస్తుతం వర్ని ప్రాంతంలోని రైతుల కోతలు మార్చి నెల చివరి వరకు పూర్తిస్థాయిలో కోతలు ముగుస్తాయి. దీనితో సన్నకారు, చిన్న కారు రైతులు కూడా ఇదే ధరను దళారులకు అమ్ముకునే పరిస్థితి ఏర్పడితే నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొత్త ప్రభుత్వం ముందస్తుగా బాన్సువాడ నియోజకవర్గంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే బాగుంటుందని రైతులు కోరుతున్నారు.

ఏప్రిల్ మొదటి వారంలో ప్రకటించవచ్చు..

వ్యవసాయ సహకార సంఘాల సమాచారం ప్రకారం ఏప్రిల్ మొదటి వారంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోల కేంద్రాలను ఏర్పాటు చేసే ఆదేశాలను ఇవ్వచ్చని సహకార సంఘాల నుంచి సమాచారం. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో రైతులకు మంచి గిట్టుబాటు ధర ఇస్తామని తెలిపింది. ఆ మాట మేరకు నియోజకవర్గంలో ముందస్తుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి క్వింటలకు రూ.2500 చెల్లిస్తుందా అనే సందేహం. లేదంటే దళారులు పెట్టిందే దరగా ఆ ధరకు అమ్ముకోక తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొత్త ప్రభుత్వం ముందస్తు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే సన్నకారు చిన్న కారు రైతులు లాభాల బాటలో ఉంటారు. అని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఏప్రిల్ మొదటి వారం వరకు రైతులు వేచి చూడవలసిందే.

గుర్రాల సరోజినమ్మకు ఉమెన్ అచీవర్స్ అవార్డు



సరోజినమ్మకు సన్మానించి చెక్కు అందజేస్తున్న మంత్రి సీతక్క, పలువురు

నవతెలంగాణ-కంఠేశ్వర్/బోధన్

తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ బోధన్ డివిజన్ గౌరవాధ్యక్షురాలు గుర్రాల సరోజినమ్మకు గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఉమెన్ అచీవర్స్ అవార్డును లక్ష రూపాయలను బహూకరించింది. మంత్రి సీతక్క చేతుల మీదుగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఉన్నతాధికారుల సమక్షంలో ఈ అవార్డుతో పాటు లక్ష రూపాయల చెక్కు రవీంద్ర భారతిలో నిర్వహించిన మహిళా దినోత్సవం ఉత్సవాలలో అందజేశారు. గత అనేక సంవత్సరాలుగా సామాజిక సేవా కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. అనాధ శవాల అంత్యక్రియలకు, అద్దె ఇళ్లలో నివసించే వారి బంధువులు చనిపోయినట్లయితే అంత్యక్రియల జరిపించుకోవడానికి ఆశ్రమాన్ని కల్పించే ధర్మస్థలిని సరోజినమ్మ నిర్మించారు. తాను నివసిస్తున్న భవనాన్ని తన తదనంతరం తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్‌కు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు బహుకరించారు. పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యే వారికి నిరుద్యోగులకు పుస్తకాలను బహుకరించారు. పేద పిల్లలకు ఫీజులు కట్టడం వైద్య సహాయాన్ని అందించటం మల్లు స్వరాజ్యం ట్రస్టుకు జనరిక్ మెడికల్ హాల్ కోసం రెండున్నర లక్షలు వితరణ చేశారు. కందకుర్తినందు ఆవులకు ఆశ్రయాన్ని కల్పించే విధంగా షెడ్డులను నిర్మించారు. 84 సంవత్సరాల వయస్సులోనూ ఈ విధంగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నందుకు ప్రతిగా రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ఉమెన్స్ అచివర్స్ అవార్డును లక్ష రూపాయలతో బహూకరించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆల్ పెన్షనర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కే రామ్మోహన్‌రావు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సరోజినమ్మకు అభినందనలు తెలిపారు.

వ్యవసాయ రంగాన్ని
కార్పొరేట్ శక్తులకు అప్పగించొద్దు

- జాతీయ రైతు సంఘాల పిలుపు మేరకు ఉమ్మడి జిల్లాలో ర్యాలీలు

నవతెలంగాణ-కామారెడ్డి/కంఠేశ్వర్

వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించొద్దని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జాతీయ రైతు సంఘాల ఎస్‌కేయం పిలుపు మేరకు ఇరు జిల్లా కేంద్రాల్లో గురువారం ర్యాలీలు చేపట్టారు. ఇప్పటికే దేశ సంపదను బడా కార్పోరేట్‌లకు అప్పనంగా అప్పజెప్తున్న కేంద్రం.. మిగిలిన వ్యవసాయ రంగాన్ని కాపాడుకోకుండే దేశంలో సాగు రంగం తీవ్ర సంక్షోభంలో పడే అవకాశం ఉందని అన్నారు.

కామారెడ్డి : జాతీయ రైతు సంఘాల ఎస్‌కేయం పిలుపు మేరకు కామారెడ్డి జిల్లా కేంద్రంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా ఆధ్వర్యంలో గురువారం బైక్ ర్యాలీ చేపట్టారు. కొత్త బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక చట్టాల వెనక్కి తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా కామారెడ్డి జిల్లా కార్యదర్శి పి.రామకృష మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం మొదటిసారిగా అధికారంలోకి వచ్చే ముందు విదేశాల్లో ఉన్నటువంటి నల్లధనాన్ని వెనక్కి తీసుకొస్తానని, దేశ ప్రజలందరూ జన్ధన్ ఖాతాలు తీయండి అందరి ఖాతాల్లో రూ.15లక్షలు జమ చేస్తామని చెప్పి, నిరుద్యోగ యువతకి ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికి అధికారంలోకి వచ్చి ప్రధానమంత్రి అయిన నరేంద్ర మోడీ అవి ఏమీ అమలు చేయకుండానే మూడోసారి ప్రధానమంత్రి కావాలని నరేంద్ర మోడీ కలలు కంటున్నాడని అన్నారు. ఈ దేశ సంపద ఆదానికి, అంబానీ చెందినటువంటి కార్పొరేట్ సంస్థలకు అప్ప చెప్పడం సిగ్గుచేటు అన్నారు. ఇప్పుడు మిగిలింది వ్యవసాయ రంగం ఒకటే వ్యవసాయ రంగాన్ని మనం కాపాడుకోకపోతే వ్యవసాయ రంగం ఈ దేశంలో తీవ్ర సంక్షోభంలో పడే అవకాశం ఉంది అన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జి.పరమేష్, ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు పి.బాలరాజ్, కార్యదర్శి ఏ.ప్రకాష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిహెచ్ అంబన్న, జిల్లా నాయకులు కిషోర్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు జి.సురేష్, ఉపాధ్యక్షులు ముఖేష్, క్రాంతి, లక్ష్మీనారాయణ, రాజు, గోపాల్, సత్యంరెడ్డి సింగ్, బి.రాజు, జి.దేవేందర్, వెంకట్, పెంటన్న, సామేలు, తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డిలో బైక్ ర్యాలీ చేపట్టిన నాయకులు, కార్యకర్తలు



నిజామాబాద్‌లో అభివాదం చేస్తున్న నాయకులు

కంఠేశ్వర్ : జాతీయ కమిటీ పిలుపు మేరకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో కిసాన్ మహా పంచాయతీ కార్యక్రమం నిర్వహించారు. సుమారు 200 మంది కార్మికులు పాల్గొన్నారు. ఎస్‌కేఎం జిల్లా కమిటీ సభ్యులు సాయిరెడ్డి ఆహ్వానించగా.. వేల్పూర్ భూమయ్య, సురేష్, సాయాగౌడ్, ఏం గంగాధరప్ప, గోవర్ధన్, గంగారెడ్డి, బొంబాయి గంగన్నలు అధ్యక్షత వహించారు. మహా పంచాయత్ వక్తలుగా.. ఎస్‌కేఎం రాష్ట్ర కన్వీనర్ వి. ప్రభాకర్, జిల్లా కమిటీ సభ్యులు ఆకుల పాపయ్య, పెద్ది వెంకట్రాములు, కంజర భూమయ్య, బి దేవరాం,పి వెంకటేష్, భాస్కర్, గంగన్న మాట్లాడారు. కాగా కార్మిక సంఘాలైన సిఐటియు, ఐఎఫ్టియు, ఏఐటియుసి, ఐఎఫ్టియు ల నాయకులు కటారి రాములు, ముసకు సుధాకర్, దాసులు మద్దతుగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వి ప్రభాకర్, ఆకుల పాపయ్య, పెద్ది వెంకట్రాములు తదితరులు మాట్లాడారు.

పరీక్షలకు టాటా.. ఇంటిబాట

- ఇంటర్ పరీక్షలు పూర్తి
- ఇంటి బాట పట్టిన హాస్టల్ విద్యార్థులు



ఇండ్లకు తరలుతున్న విద్యార్థినులు



బ్యాగులతో బస్టాండ్‌లో విద్యార్థులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు ముగిసాయి. ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పరీక్షలు ముగియడంతో అధికార యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది. కాగా పలువురు విద్యార్థులు మాల్‌ప్రాక్టిసింగ్ చేస్తూ పట్టుబడటంతో డిబార్ అయ్యారు. కాగా పరీక్షలు ముగియడంతో హాస్టల్స్‌లో ఉండి చదువుకున్న విద్యార్థులు తమ బ్యాగులు సర్దుకొని ఇంటి బాట పట్టారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకెళ్లేందుకు రావడంతో బస్టాండ్‌లు కిక్కిరిసాయి.

గురువారం రెండవ సంవత్సరం గణంక శాస్త్రం, రసాయన శాస్త్రం పరీక్షలతో ప్రధానమైన ఇంటర్ పరీక్షలు పూర్తయ్యాయని జిల్లా ఇంటర్ విద్యా అధికారి రఘురాజ్ తెలిపారు. మరో రెండు రోజులు బ్రిడ్జ్ కోర్సు సబ్జెక్ట్ ల పరీక్షలు జరగాల్సి ఉన్నయని తెలిపారు. జిల్లాలో మొత్తం 36 మంది విద్యార్థుల పై మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయని డిఐఈఓ తెలిపారు. జిల్లాలో మొత్తం 15,698 మంది విద్యార్థులకు గాను 15,230 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని అన్నారు.

పది పరీక్షలకు సర్వం సిద్ధం

- 18 నుంచి పదోతరగతి వార్షిక పరీక్షలు
- జిల్లా వ్యాప్తంగా 143 కేంద్రాల్లో ఏర్పాట్లు
- ఆన్‌లైన్‌లో సైతం అందుబాటులో హాల్‌టికెట్స్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధమైంది. ఈనెల 18 నుంచి ఏప్రిల్ 2 వరకు నిర్వహించనున్న పరీక్షలకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. భౌతిక, జీవశాస్త్ర పరీక్షలు మినహా.. మిగతా పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు జరగనున్నాయి. పరీక్ష హాల్‌లోకి ప్రవేశానికి ఐదు నిమిషాల గ్రేస్ పిరియడ్ కేటాయించిన అధికారులు.. హాల్‌టికెట్‌లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నావని, వాటిని డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షలకు హాజరుకావొచ్చని, వాటిపై ఎలాంటి సంతకం, స్టాంప్‌లు అవసరం లేదని తెలిపారు.

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 22,274 మంది పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. వీరిలో రెగ్యూలర్ విద్యార్థులు 21,895 మంది ఉండగా.. 11,107 మంది బాలురు, 10788 మంది బాలికలు ఉన్నారు. ప్రైవేట్‌గా రాసే విద్యార్థులు 379 మంది విద్యార్థులు, అందులోనూ బాలురు 236, బాలికలు 143 మంది విద్యార్థులు ఉన్నారు. కాగా పరీక్షల కోసం జిల్లా వ్యాప్తంగా 143 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం ఏడు పరీక్షలు జరగనున్నాయి. గతంలో 11 పేపర్‌లు ఉండగా.. వాటిని 7కు కుదించారు. భాషా పరీక్షలకు, గణితము, సాంఘిక శాస్త్రములకు ఒక రోజే పరీక్షలు నిర్వహిస్తారు. సామాన్య శాస్త్రంలో మాత్రం రెండు (భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం) భాగాలుగా విభజించి రెండు రోజులు పరీక్షలను నిర్వహించనున్నారు. ప్రతిరోజు పరీక్షల సమయం (3గంటలు) ఉదయం 9 గంటల 30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు నిర్వహిస్తారు. కానీ సైన్స్ పరీక్షలకు మాత్రం భౌతిక శాస్త్రము, జీవ శాస్త్రమునకు ఉదయం 9 గంటల 30 నిమిషాల నుంచి 11 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు.

విద్యార్థులకు ఆన్‌లైన్‌లో పొందిన హాల్ టికెట్‌ని పరీక్ష కేంద్రాలో అనుమతిస్తున్నట్టు డీఈవో తెలిపారు. వెబ్సైట్ www.bse.telangana.gov.in లో హాల్ టికెట్ పొందవచ్చు సూచించారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులను 5 నిమిషాల ఆలస్యం వరకు మాత్రమే అనుమతించనున్నారు. పరీక్ష కేంద్రాలను ఏ,బి,సి కేటగిరీలుగా విభజించారు.



పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, అదేవిధంగా పరీక్ష కేంద్రాల్లోని చీఫ్ సూపరింటెండెంట్ రూములో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ బస్సులను పరీక్షల సమయానికి అనుగుణంగా నడపాలని ఇది వరకే విద్యాశాఖ నుంచి ఆర్టీసీ అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. పరీక్ష సమయంలో విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా విద్యుత్ అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రంలోకి ఇన్విజిలేటర్లకు, చీఫ్ సూపరింటెండెంట్స్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్స్, ఎవరికి సెల్ ఫోన్లను అనుమతించడంలేదు. ఏ ఒక్క విద్యార్థి పరీక్ష కేంద్రంలోకి స్కూల్ యూనిఫామ్ ధరించినా వారికి అనుమతి లేదు. పరీక్ష కేంద్రాల వద్ద ప్రతి పరీక్ష కేంద్రానికి ఒక ఏఎన్‌ఎంని అందుబాటులో ఉంటారని, ఏఎన్‌ఎంల వద్ద ఓఆర్‌ఎస్ పాకెట్స్, ఫస్ట్ ఎయిడ్ కిట్లతో అందుబాటులో ఉండనున్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు
డీఈవో దుర్గాప్రసాద్



పదోతరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. పరీక్ష కేంద్రాల వద్ద ఉన్న జిరాక్స్ సెంటర్లను పరీక్ష సమయంలో మూసివుంచాలని ఆదేశించాం. పరీక్ష కేంద్రాలకు పూర్తి ఏర్పాట్లలో భాగంగా చీఫ్ సూపరింటెండెంట్ డిపార్ట్మెంటల్ ఆఫీసర్స్, రూట్ ఆఫీసర్స్, కస్టోడియన్స్, జాయింట్ కస్టోడియన్స్‌లను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేశాము. అంతేకాకుండా ఫ్లయింగ్ స్క్వాడ్, సెట్టింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేశాము. ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పకడ్బందీగా పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ఏర్పాట్లు చేశాము.

రైతులను మోసం చేయొద్దు

- ఎరువులు, విత్తనాలు, మందుల విక్రయాలపై డీలర్‌లు అవగాహన కలిగి ఉండాలి
- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

ఎరువులు,విత్తనాలు,, పురుగుల మందులు విక్రయించే డీలర్లకు వ్యవసాయ రంగంపై అవగాహన కలిగి ఉండాలని అప్పుడే రైతులకు నాణ్యమైన మేలురకం వాటిని అందించవచ్చని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఆరుగాలం కష్టించి పనిచేసే రైతుల పట్ల నిజాయితీగా ఉండాలని, వారిని మోసం చేయవద్దని డీలర్లకు సూచించారు. గురువారం కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో ఎల్లారెడ్డి, బిచ్కుంద, బాన్సువాడ డివిజన్లకు చెందిన విత్తన, పురుగులమందులు, ఎరువుల విక్రయించే ఇన్‌పుట్ డీలర్లకు ఏర్పాటు చేసిన వ్యవసాయ విస్తరణ సేవ డిప్లొమా కోర్సు శిక్షణా తరగతులను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఒక్కో బ్యాచ్‌లో 40 మంది డీలర్ల చొప్పునఉంటారని, వారికీ 48 వారాల పాటు రైతులకు నాణ్యమైన విత్తనాలు,ఎరువులు, పురుగుల మందులు విక్రయించుటపై డీలర్లకు శిక్షణా తరగతులు నిర్వహించనున్నా మన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల పంట పొలాలకనుగుణంగా ఎరువులు,విత్తనాలు, పురుగుల మందులు అందించాలని, లాభాపేక్షతో అనవసరంగా సారవంతమైన భూములకు వాటిని అందించి పాడుచేయవద్దని కోరారు. వర్షాధారిత ప్రాంతమైన మన జిల్లాలో రైతులకు వ్యవసాయం లాభసాటి కల్పించుటకు గాను శాస్త్ర, సాంకేతిక పద్ధతులు, అవలంబించుట, మెళకువలు పాటించుటపై అవగాహన కలిగించాలని డీలర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మేనేజ్ సంస్థ ప్రతినిధి సుధారాణి, జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి, తరగతులు ఫెసిలిటేటర్లు నరసింహ చారి, రామచంద్ర రెడ్డి, వ్యవసాయాధికారులు, డీలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

సీసీ రోడ్డు పనుల ప్రారంభం



నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని వర్జిన్ తండా గ్రామపంచాయతీ పరిధిలో సీసీ రోడ్లను కాంగ్రెస్ నాయకులు గురువారం ప్రారంభించారు. రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద సిసి రోడ్లకు రెండు లక్షల నిధులు మంజూరు చేశారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు బాలరాజు నాయక్, గ్రామ అధ్యక్షులు మొజీరం నాయక్, కాంగ్రెస్ నాయకులు, గ్రామ కమిటీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, తాండ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సరస్వతి దేవి విగ్రహ ప్రతిష్టాపన

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం శ్రీ సరస్వతి దేవి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణ, విగ్రహ దాతలు గ్రామానికి చెందిన గోపు నారాయణ లావణ్య దంపతుల ఆధ్వర్యంలో పూజారి కృష్ణ పంతులు శ్రీ సరస్వతి దేవి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సక్కారం అశోక్, ఎంపిటిసి సభ్యురాలు తోట జ్యోతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగాధర్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్, గౌడ్, రాజమౌళి, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు ఆకుల భాజన్న, మాజీ ఉప సర్పంచ్‌లు విక్రమ్, నేల రమేష్, బియ్యపు నారాయణ, గొల్ల మహేష్, బుక గోవర్ధన్, సాంబార్ సుమన్, అవుసుల అనిల్, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, గ్రామ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమ్ముకోవడానికే అనుమతులా?



అనుమతులు లేకుండా తరలిస్తున్న టిప్పర్ల దృశ్యం

- అనుమతులు ఓ చోట, తవ్వకాలు మరోచోట
- అనుమతులు ఉన్నాయని మొరాన్ని అమ్ముకుంటున్న వైనం
- అధికారులనే బురిడీ కొట్టిస్తున్న మొరం మాఫియా

నవతెలంగాణ-మాక్లూర్

ఒక పక్క ప్రభుత్వాలు హరితహారం పేరుతో వందల కోట్లు వెచ్చించి గ్రామాల్లో చెట్లతో పచ్చదనానికి పాటుపడుతుంటే మరో వైపు అక్రమార్కులు గుట్టలో చెట్లను తొలగిస్తు పర్యవరణానికి హనీకలిగిస్తున్నారు. ప్రభుత్వం గుట్టలను సంరక్షించాల్సిన అవసరం ఉందని చెపుతున్న ఆచరణలో మాత్రం కనిపించడం లేదు. వాటిపై ప్రభుత్వాలుగానీ, అధికారులు గానీ ఎటువంటి చర్యలు చేపట్టకుండా కోట్లా ప్రజాధనం హరితహారం పేరుతో వృథాచేస్తున్నారు. ఈ గుట్టల్లో మొరం తీసెయ్యడంతో కోట్లు విలువచెసే మొరాన్ని అమ్ముకుని, ఈ ప్రభుత్వ భూములను ప్రజాప్రతినిధులు పలుకుబడితో యథేచ్ఛగా చదును చేసి భుమిని సాగుగా మార్చి ప్రభుత్వ భుమిని ఆక్రమిస్తున్నారు. ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండా మొరం తవ్వకాలు చేపట్టి అక్రమంగా గుట్టను తవ్వేస్తు ప్రజాధనాన్ని గండికొట్టి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. ఈ మొరాన్ని టిప్పర్ల సహాయంతో ప్రభుత్వ పనుల పేరుతో నిజామాబాద్ జిల్లాకేంద్రానికి రవాణా సాగిస్తూ అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారు. అనుమతులు ఓ చోట, తవ్వకాలు మరో చోట జపుతున్నారనే సమాచారంతో మండలంలోని చిన్నాపూర్, సింగంపల్లి శివారులో అక్రమ మైనింగ్ నిర్వహిస్తున్న మొరం తవ్వకాలపై నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు జిల్లా టాస్క్ ఫోర్స్ ఏసిపి విష్ణుమూర్తి ఆధ్వర్యంలో సీఐ అంజయ్య సిబ్బందితో కలిసి బుధవారం మెరుపు దాడులు నిర్వహించారు. అక్రమ మొరం తవ్వకాలు నిర్వహిస్తున్న రెండు జెసిబి లు, 21 టిప్పర్లను అధికారులు సీజ్ చేశారు. అక్రమ మైనింగ్ మొరం తవ్వకాలపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి వాహనాలను అప్పగించారు.

అమ్ముకోవడానికే అనుమతులా...

తమకు ఐదు సంవత్సరాల పాటు అనుమతులు ఉన్నాయంటూ అధికారులనే మొరం మాఫియా బురడీ కొట్టిస్తున్నారు. పట్టా భూములు ఉంటే చదును చేసుకోవడానికి అధికారులు అనుమతులు ఇస్తారు. కానీ అమ్ముకోవడానికి మాకు అనుమతులు ఉన్నాయంటూ గుట్ట ప్రాంతాన్ని తవ్వి



గుట్టలను చీల్చి మొరం తవ్వుతున్న దృశ్యం

మొరాన్ని జిల్లా కేంద్రానికి తరలించి వెంచర్లకు, ప్రయివేట్ వ్యక్తులకు అమ్ముకుంటున్నారు.

ఒకే వేబిల్లు, పది టిప్పర్లు..

ప్రతి రోజు ఒకే వేబిల్లు తీసుకొని పది టిప్పర్ల చొప్పున మొరాన్ని తరలిస్తున్నారు. ఈ తంతు వారం రోజులుగా కొనసాగుతుంది. సుమారు 21 టిప్పర్లతో రోజుకు 210 టిప్పర్లను అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కో టిప్పర్ సుమారు రూ. 2500 చొప్పున అమ్ముకుంటున్నారు.

ఎంక్వైరీ కొనసాగుతుంది..

అనుమతులు ఉన్న ప్రాంతం నుంచి తీశారా.. మరో చోట నుంచి మొరాన్ని తీశారా అనే దానిపై ఎంక్వైరీ కొనసాగుతుందని, ఎన్ని వాహనాలకు అనుమతులు ఉన్నాయని ఆరాతీస్తునట్లు అధికారులు చెబుతున్నారు.

గతంలో రూ. 89 లక్షల జరిమానా..

ఇదే ప్రాంతంలో గతంలో గంగారెడ్డి అనే వ్యక్తి అక్రమ మొరం తరలిస్తే అధికారులు రూ. 89లక్షల జరిమానా విధించింది నోటీసులు జారీ చేశారు. జరిమానాలు చెల్లించక ముందే మొరం మాఫియా మొరాన్ని తరలించడంపై సర్వత్రా చర్చలు జరుగుతున్నాయి.

అనుమతులు లేవు: తహసిల్దార్ షబ్బీర్

మండలంలో సింగపల్లి శివారులోని 51 సర్వే నెంబర్‌లో మాత్రమే అనుమతి ఉంది. ఎక్కడ కూడా మొరం తవ్వకాలకు ఎలాంటి అనుమతులు లేవు. అనుమతులు లేకుండా మొరాన్ని తరలిస్తే చర్యలు తప్పవు.

ఐదు సంవత్సరాల అనుమతి ఉంది: మైనింగ్ ఏడీ సత్యనారాయణ

అక్కడ ఐదు సంవత్సరాల 2027 వరకు అనుమతి ఉంది. టాస్క్ ఫోర్స్ అధికారులు ఎంక్వైరీ సాగిస్తున్నారు. సర్వేలు నిర్వహించి తదుపరి చర్యలు తీసుకుంటాం.

పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలి

నవతెలంగాణ-సిరికొండ

ప్రతి గ్రామంలో పశువులకు గాలికుంటు టీకాలు ఉచితంగా వేస్తున్నట్టు మండల పశువైద్యాధికారి డాక్టర్ బాబురావు గురువారం తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో పాడి రైతులకు కలిగి ఉన్న పశువులకు గాలికుంటు టీకాలు వేయించుకోవాలన్నారు. ఒకరోజు ముందుగానే సమాచారం అందజేస్తామని, ఆ గ్రామ పాడి రైతులు ఉపయోగించుకోవాలని బాబురావు అన్నారు

గోదాం నిర్మాణానికి రూ.10లక్షలు మంజూరు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలో సింగిల్ విండో గోదాం నిర్మాణానికి రూ.10 లక్షల నిధులు మంజూరు చేస్తూ ప్రొసీడింగ్ కాపీని రాష్ట్ర మాజీ మంత్రి, బాల్కొండ శాసనసభ్యులు వేముల ప్రశాంత్ రెడ్డి అందజేశారు.ఈ మేరకు నిధుల మంజూరు పత్రాలను సింగిల్ విండో చైర్మన్, టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్, విండ పాలకవర్గ సభ్యులకు అందజేశారు. గతంలో కమ్మర్ పల్లి సొసైటీ గోదాం నిర్మాణానికి మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి నియోజకవర్గ ప్రత్యేక అభివృద్ధి నిధుల నుండి రూ.10 లక్షలు, నాబార్డ్ నిధుల ద్వారా రూ.10లక్షలు మంజూరు చేయించారు. అయితే ప్రభుత్వం మారడంతో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నిధులను రద్దు చేసింది. రైతుల శ్రేయస్సు కొరకు గోదాం నిర్మాణ ఆవశ్యకతను సొసైటీ పాలకవర్గం సమస్యను ప్రశాంత్ రెడ్డికి వివరించారు. వెంటనే స్పందించిన ఆయన బిఆర్ఎస్ పార్టీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ ఎంపీ నిధుల ద్వారా కమ్మర్ పల్లి సొసైటీ గోదాం నిర్మాణం రూ.10లక్షలు మంజూరు చేయించారు. అట్టి నిధులకు సంబంధించిన మంజూరు పత్రాలను ప్రశాంత్ రెడ్డి పాలకవర్గ సభ్యులకు అందజేశారు. సింగిల్ విండో గోదాం నిర్మాణానికి నిధులు అందించిన రాజ్యసభ సభ్యులు సంతోష్ కుమార్ కు ప్రత్యేక శ్రద్ధ చూపించి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డికి పాలకవర్గం తరపున, రైతుల తరపున చైర్మన్ రేగుంట దేవేందర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో విండో పాలకవర్గ సభ్యులు బద్దం రాజశేఖర్, రేంజర్ల మహేందర్, తీగల హరీష్, అమ్మవారి గంగారెడ్డి, సామా నరేష్, ఎంపీటీసీ సభ్యుడు మైలారం సుధాకర్, మాజీ సర్పంచ్ గడ్డం స్వామి, కొంటిగంటి నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న సంఘం సభ్యులు

నవతెలంగాణ-మోపాల్

ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తూ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో గురువారం సంబరాలు చేసుకున్నారు. మండలంలోని బోర్గాం (పి) గ్రామంలోని మొట్టడి రెడ్డి కళ్యాణ మండపం ఆవరణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసే రెడ్డి కార్పొరేషన్ ద్వారా పేద రెడ్డి కుటుంబాలకు, పేద విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని జిల్లా రెడ్డి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ రెడ్డి అన్నారు. దశాబ్దాల కల నెరవేరిందని ఎన్నోసార్లు పోరాటాలు చేశామని, ఆఖరికి జైలు జీవితం కూడా గడిపిన రోజులు ఉన్నాయని అన్నారు. ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయడమనేది చాలా శుభసూచకమని రెడ్డి సోదరులు తెలిపారు

ఇంటి పన్నులు వసూలు



పన్నులు వసూల్లు చేస్తున్న ఎంపీవో

నవతెలంగాణ-ఏర్గట

మండలంలోని బట్టాపూర్ గ్రామములో ప్రత్యేక బృందం ద్వారా ఇంటి పన్నుల వసూళ్ళ కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపీఓ శివ చరణ్ తెలిపారు. బట్టాపూర్ గ్రామంలో గురువారం 61 వేల రూపాయల ఇంటి పన్నులు వసూలు చేశామని అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఈ నెల 31 లోపు తమ ఇంటి పన్నులు గ్రామపంచాయతీలలో చెల్లించి రశీదు తీసుకోవాలని, గ్రామాభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు జాకీర్ హుస్సేన్, భోజన్న, శ్రీకాంత్, రాకేష్, భార్గవ్, సంధ్యారాణి, అనిల్, రవి, పాల్గొన్నారు.

మద్యం మాఫియాపై చర్యలు తీసుకోవాలి

- ఆబ్కారి కార్యాలయం ఎదుట ధర్నా

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

సిరికొండ, ధర్పల్లి మండలాల్లో అక్రమ, నాసిరకం మద్యం తయారు చేసి విక్రయిస్తున్న మద్యం మాఫియాపై చర్యలు తీసుకోవాలని సిపిఐ (ఎం-ఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా)పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని అబ్కారిశాఖ సూపరింటెండెంట్ అధికారి కార్యాలయం ముందు గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా పార్టీ ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి ఆర్.రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి రాక ముందు గ్రామాల్లో ఉన్న బెల్ట్, మద్యం షాపులను రద్దు చేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. కానీ ఇప్పటికి ఎలాంటి చర్యలు ప్రభుత్వం తీసుకుంటున్న దాఖలాలు లేవన్నారు. దీన్ని ఆసరాగా చేసుకొని మద్యం వ్యాపారులు ముఖ్యంగా సిరికొండ, ధర్పల్లి, మండలాలకు చెందిన వైన్స్‌ల యాజమాన్యాలు గ్రామాలను పంచుకొని నాసిరకం మద్యం తయారు చేస్తూ.. బెల్ట్ షాప్‌లను నిర్వహిస్తు, నాసిరకం మద్యంను విక్రయిస్తు ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నారని తెలిపారు. దీని వల్ల ప్రజలు తీవ్రమైన అనారోగ్యం పాలు అవుతున్నారని, ఎవరు ఏం చేయరు అన్న ధీమాతో నాసిరకం మద్యం అమ్మకాలను జోరుగా సాగిస్తున్నారని అనానరు. దీంతో ఇటు ప్రభుత్వ ఆదాయం, అటు ప్రజల ఆరోగ్యానికి తీవ్రమైన నష్టం కలిగిస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో చట్టవ్యతిరేకంగా నిర్వహిస్తున్న బెల్ట్ మద్యం షాప్‌లపై విసిగి పోయిన గ్రామల్లోని యువత, మహిళలు దాడులు చేసే అవకాశం కూడా ఉందన్నారు. కావున అక్రమ మద్యాన్నీ చట్టవ్యతిరేకంగా విక్రయిస్తున్న మూడు వైన్స్ యాజమానులపై కఠిన చర్యలు తీసుకొని గ్రామాల్లో బెల్ట్ షాప్‌లను అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఐ (ఎం-ఎల్) మాస్ లైన్, ప్రజా సంఘాల డివిజన్, మండల నాయకులు దామోదర్, బాబన్న, సాయరెడ్డి, లింబాద్రి, రమేష్, ఎర్రన్న, నాగయ్య, పండరి, బాబురావు, గంగమళ్ల, సర్పంచ్ సాయిలు, బబ్లు, నరేష్, రవి, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దృశ్యం

గమనం, జననం, సృష్టి ఉండాలంటే స్త్రీ ఉండాలి

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/కంఠేశ్వర్

గమనం, జననం, సృష్టి ఉండాలంటే స్త్రీ ఉండాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో మహిళా శిశ, దివ్యంగుల వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎక్కడైతే స్త్రీలు గౌరవించపడతారో అక్కడ సకల దేవతలు నిలయమై ఉంటారని అన్నారు. స్త్రీని గౌరవించి పూజించే ఏకైక దేశం భారత దేశం అని, ఈ దేశాన్ని భారత మాత అంటు అమ్మలా చూసుకుంటాం అని అన్నారు. ఒకప్పుడు వంటింటికి పరిమితం అన్న మహిళలు అన్ని రంగాలలో పురుషులతో సమానంగా దూసుకుపోతున్నారన్నారు. స్వతంత్ర సమరంలో కూడా ఎందరో వీర వనితలు తమ ప్రాణాలను అర్పించారని ఝాన్సీ లక్ష్మిబాయి, రాణి రుద్రమ్మ లాంటి వీర వనితలు మనకు ఆదర్శం అని మహిళా శక్తి జాతీయ శక్తి అని పేర్కొన్నారు. భారతీయ జనతా పార్టీ (బిజెపి)మహిళలకు పెద్దపీఠ వేసిందని అన్నారు. ఒక సామాన్య గిరిజన మహిళను రాష్ట్రపతి చేసిన ఘనత బిజెపిది అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్ కూడా అమలు చేసిన పార్టీ బిజెపి అని తెలిపారు. నరేంద్రమోడీ మహిళల అభివృద్ధి, సాధికారత కోసం అనేక పథకాలు తీసుకొచ్చారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ విఠల్, మేయర్ నీతుకిరణ్, ట్రైన్ ఐఏఎస్ కిరణ్ మయి, జిల్లా సంక్షేమ అధికారి రసూల్ బీ, అడ్వకేట్ లోకల్ కమిటీ నిరజరెడ్డి, వసుంధర, జిల్లా మైనారిటీ అధికారి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వళన చేస్తున్న ఎమ్మెల్యే, మేయర్, తదితరులు

యాదవ, కురుమ కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయం

- యాదవ సంఘం జిల్లా నాయకులు ఏట్టెం మహేష్ యాదవ్

నవతెలంగాణ-ముప్కాల్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యాదవ, కురుమ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం పట్ల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, యాదవ సంఘం జిల్లా నాయకులు, వేంపల్లి మాజీ ఉప సర్పంచ్ ఏట్టెం మహేష్ యాదవ్ గురువారం హర్షం వ్యక్తం చేశారు. యాదవ, కురుమ కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాపాలనలో యాదవులు రాజకీయంగా, పారిశ్రామికంగా ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నట్లు గుర్తుచేశారు.

మహిళా సంక్షేమమే ప్రధాన ధ్యేయం

నవతెలంగాణ-మాక్లూర్

మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలని, మహిళల అభివృద్దే, సంక్షేమమే ప్రధాన ధ్యేయమని మున్సిపల్ ఫ్లోర్ లీడర్, శక్తి వందన్ అభియాన్ ఇంఛార్జి గోపిడి స్రవంతి రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఉపాధి హామీ కూలీలతో ఆమె మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ అన్ని విధాల మహిళల కోసం పని చేస్తుందని, సుకన్య సంవృద్ధి, ఉజ్వల, కార్మికులకు బీమా పథకాలను కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని, వాటి విధివిదానాలను మహిళలకు వివరించారు. కాంగ్రెస్ అంటేనే కరెంట్ పోతదని, కాంగ్రెస్ పాలనలో కష్టాలే ఉంటాయని తెలిపారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ చేసిన పలు సంస్కరణలను, అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు సురేష్, ఉపాధ్యక్షులు ఎం. రవి యాదవ్, రాజు, సంతోష్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

మానవాళి సమస్యలకు మార్క్సిజమే పరిష్కారం

- కారల్ మార్క్స్ కు విప్లవజోహార్లు అర్పించిన సిపిఐ (ఎంఎల్) ప్రజాపంథా

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

విశ్వమానవ ప్రేమికుడు, కార్మిక వర్గ సిద్ధాంతకర్త, ప్రపంచ మేధావి కారల్ మార్క్స్ 141వ వర్ధంతి సందర్భంగా సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) నిజామాబాద్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కోటగల్లి శ్రామిక భవన్‌లో విప్లవ నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ(ఎం.ఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ మాట్లాడుతూ... ప్రపంచ మానవాళి సమస్యల పరిష్కారానికి మార్క్సిజమే మార్గమన్నారు. ప్రపంచంలోని మూడోవంతు జనాభాను ప్రభావితం చేసిన గొప్ప తత్వశాస్త్రం మార్క్సిజం అని అన్నారు. ప్రపంచంలోని కార్మిక వర్గానికి దిక్సూచి మార్క్సిజం అని అన్నారు. కమ్యూనిస్టు మేనిఫెస్టో రాసి ప్రపంచ కార్మికులకు విముక్తి మార్గం చూపెట్టాడన్నారు. దేశంలో, ప్రపంచంలో కొనసాగుతున్న ప్రపంచీకరణ, సామ్రాజ్యవాద దుష్పలితాలకు పరిష్కారం మార్క్సిజమేనన్నారు. మార్క్సిజాన్ని ఆయా పరిస్థితులకు అన్వయించుకుంటూ ముందుకెళ్లాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ (ఎం.ఎల్) ప్రజాపంథా రాష్ట్ర నాయకులు ఎం.నరేందర్, డివిజన్ కార్యదర్శి ఎం.వెంకన్న, సహాయ కార్యదర్శి సాయగౌడ్, నగర కార్యదర్శి ఎం.సుధాకర్, జిల్లా నాయకులు డి.రాజేశ్వర్, డిచ్‌పల్లి మండల కార్యదర్శి బి.మురళి, పిఓడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి కే.సంధ్యారాణి, పిడిఎస్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.గణేష్, ఐఎఫ్టీయూ జిల్లా నాయకులు కిరణ్, రాందాస్, సాయరెడ్డి, లక్ష్మీకాంత్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

ముగిసిన ఇంటర్ పరీక్షలు

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని రెండు పరీక్ష కేంద్రాల్లో జరిగిన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు గురువారంతో ముగిశాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం 288 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు, నలుగురు విద్యార్థులు హాజరు కాలేదని ప్రిన్సిపాల్ చిన్నయ్య తెలిపారు. ప్రభుత్వ మోడల్ కళాశాల పరీక్ష కేంద్రంలో 356 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 9 మంది విద్యార్థులు హాజరు కాలేదనీ ప్రిన్సిపాల్ శంకర్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా ముగియడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు.

తెలంగాణ సాంఘిక, గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-మోపాల్

తెలంగాణ సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కంజర ప్రిన్సిపల్ జి మాధవి లత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టీఎస్‌డబ్ల్యు ఆర్ఈఐ సంస్థ కరీంనగర్ జిల్లా అల్గునూరు పాఠశాలలో 80 సీట్ల బాలికలకు, రంగారెడ్డి జిల్లా గౌలి దొడ్డి (బాలికలకు) 80 సీట్లు, ఖమ్మం జిల్లాలో బాలుర స్కూల్లో 90 సీట్లు ఎనిమిదవ తర గతిలో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. అర్హత ప్రమాణాలు వెబ్సైట్లో ఉన్నాయని, ఆరవ తరగతి నుండి తొమ్మిదవ తరగతిలో మిగిలి ఉన్న సీట్ల ప్రవేశానికి గాను ప్రవేశ పరీక్ష బీఎల్‌వీసెట్-2024 అభ్యర్థులు www.tswreis.ac.in వెబ్‌సైట్ అంతర్జాలం ద్వారా 04-03-2024 నుండి 23-03-2024 వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారని తెలిపారు.

బిజెపి మతోన్మాదానికి వ్యతిరేకంగా మహిళలు పోరాడాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

బిజెపి మతోన్మాదానికి వ్యతిరేకంగా మహిళలు పోరాడాలి అని సిపిఐ ఎం ఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి బి. భాస్కర్ పిలుపునిచ్చారు. ప్రగతిశీల మహిళ సంఘం (పిఓడబ్ల్యు) ఆధ్వర్యంలో మార్చి 8అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా గురువారం నిజామాబాద్ నగరంలోని నాగారంలో మహిళ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో భాస్కర్ మాట్లాడుతూ దేశంలో మహిళలపై అత్యాచారాలు, లైంగిక వేధింపులు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో విద్వేశ రాజకీయాలు పెరిగాయని ఆరోపించారు. సమాన పనికి సమాన సమాన వేతనం ఇవ్వటైలేదని విమర్శించారు. నిత్యావసర సరుకుల ధరలు పెంచి మహిళలపై భారం వేశారని అన్నారు. మహిళ దినోత్సవం స్ఫూర్తితో మహిళా లోకం అసమానతలకు, వివక్షతకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పిఓడబ్ల్యు జిల్లా కార్యదర్శి సవిత, శివరాజు, దుడ్డు గంగాధర్, గంగారెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలకు బెంచీలు వితరణ



నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండలంలోని మెలకుంట తండా గ్రామపంచాయతీ పరిధిలో గల తాటి చెట్టుగడ్డ తాండ లో గల ప్రాథమిక పాఠశాలకు పైడి ఎల్లారెడ్డి బెంచీలను వితరణ చేసినట్లు ఎంపీపీ రాజుదాస్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ రాజదాసు మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన గ్రామాలలో కనీస వసతులు కల్పించాలని ఆలోచనతో పైడి ఎల్లారెడ్డి బెంచీలు వితరణ చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఎంపిటిసి సుజాత నాయకులు ధనుంజయ్, బాల్‌రెడ్డి, ప్రవీణ్, దేవి సింగ్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బెంచీల వితరణ

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలో రాంపల్లికోన తాండ, బోనాల్ తండా గ్రామాలలోని స్కూల్‌లలో ప్రముఖ శాస్త్రవేత్త డా. పైడి ఎల్లారెడ్డి బెంచీల వితరణ గురువారం చేశారు. ఈ సందర్భంగా డా.పైడి ఎల్లారెడ్డి మాట్లాడుతూ తాను కూడ చిన్న గ్రామంలో పుట్టి పెరిగి అంతర్జాతీయ స్థాయిలో కష్టపడి శాస్త్రవేత్తగా ఎదిగనన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటానని విద్యా ప్రమాణాలు పెంచే విధంగా తనకు తోచినంత సాయం పాఠశాలకు చేస్తామన్నారు. సమస్యలు తమ దృష్టికి తీస్తే వెంటనే పరిష్కరిస్తానన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు పైడి ఎల్లారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డిపేట్ ఎంపీపీ దివిటి రాజదాస్, బాల్‌రెడ్డి, తోట సాయిలు, సత్యనారాయణరెడ్డి, కిష్టయ్య, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

నీటి సంరక్షణ పనులు చేపట్టాలి

- ఉపాధి హామీ పనులపై జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సమీక్ష

నవతెలంగాణ-కామారెడ్డి

ఉపాధి హామీలో నీటి సంరక్షణ పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం ఉపాధి హామీపై మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ హాజరై మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీలో భాగంగా నీటి నిల్వ కుంటలు,(రీఛార్జ్ ఫీట్లు)పర్కులేషన్ ట్యాంకులు, కంటూర్ కందకాలు కూలీలతో తవ్వించి భూగర్భ జలాల పెంపునకు దోహదపడాలని తెలిపారు. ఉపాధి హామీ పనులకు కూలీలు అధిక సంఖ్యలో హాజరయ్యే విధంగా మండల స్థాయి అధికారులు చూడాలన్నారు. గ్రామాల్లో చేపట్టవలసిన పనులను గుర్తించి, జాబ్ కార్డ్ ఉన్న కూలీలకు పనులు కల్పించాలని చెప్పారు. చెరువులలో పూడిక మట్టి తొలగించే కార్యక్రమాన్ని చేపట్టాలని, పూడిక తీసిన మట్టిని రైతుల పంట పొలాలకు పంపించాలని సూచించారు. గ్రామాల్లో సాగునీటి కాలువలలో కూలీలతో పూడిక తీయించాలన్నారు. కూలీలకు ఉపాధితో పాటు, రైతుల పంట పొలాలకు సాగునీరు సక్రమంగా అందే వీలు కలుగుతుందని పేర్కొన్నారు. మండ లాల వారిగా ఉపాధి హామీలో జరుగుతున్న పనులు, వస్తున్న కూలీల సంఖ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిఆర్డిఓ చందర్ నాయక్, ఏపీవోలు, సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిర్మించి విస్మరణ

- రైతు వేదికల్లో దుమ్ము ధూళీ..
- నిర్వహణ లోపాలతో రైతులకు దూరమవుతున్న వైనం
- పట్టించుకోకుంటే.. లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా

నవతెలంగాణ-నిజాంసాగర్



వడ్డెపల్లిలోని రైతు వేదిక



విరిగిపోయిన డోర్

రైతు వేదికలు.. రైతులకు పంటల సాగుపై, నూతన విధానాలు, ఇతరాత్ర సాగు సంబంధిత అంశాలు ఎప్పటికప్పుడు తెలియజేసేందుకు రైతు వేదికలు నిర్మించారు. ఒక్కో రైతు వేదిక నిర్మించేందుకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద రూ.20 లక్షల చొప్పున నిధులు కేటాయించి నిర్మించి అట్టహాసంగా ప్రారంభోత్సవాలు చేపట్టారు. అయితే వాటిల్లో కొన్ని విస్మరణకు గురవుతున్నాయి. పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించకపోవడంతో వాటిని విస్మరించడంతో సదరు రైతు వేదికలు దుమ్ము ధూళితో నిండిపోయాయి.

నిజాంసాగర్ మండలంలో మొత్తం నాలుగు రైతు వేదికలు నిర్మించారు. అయితే వారి నిర్వహణను వ్యవసాయశాఖకు అప్పగించింది. కానీ పర్యవేక్షణ కరువై, పనులు పూర్తి కాకపోవడంతో సౌకర్యాలు లేక వాడకంలో లేకుండా పోయాయి. మండలంలోని వడ్డేపల్లి గ్రామంలో నిర్మించిన రైతు వేదిక దుమ్ము ధూళితో నిండిపోయి శిథిలావస్థ స్థితికి చేరింది. సరైన నిర్వహణ లేకపోవడం వల్లనే శిథిలావస్థకు చేరిందని క్లస్టర్ పరిధిలోని రైతులు వాపోతున్నారు. మిగతా చోట కూడా రైతు వేదికలను తాళం వేసి ఎలాంటి వేదికలను నిర్వహించకుండా మూసివేశారు. రైతుల సమస్యలపై ప్రతివారం వ్యవసాయ అధికారులు రైతు వేదికలలో రైతుల సమావేశం నిర్వహించాల్సి ఉంటుంది. ఏ ఒక్కచోట కూడా రైతుల సమావేశం నిర్వహించకపోవడం వలన లక్షలు వెచ్చించి నిర్మించిన రైతు వేదికలు వృథాగా మారుతున్నాయి.



డోర్ లేకుండా బాత్‌రూమ్ దుస్థితి

పనులు పూర్తవ్వకపోవడంతో..

అమర్ ప్రసాద్. మండల వ్యవసాయ అధికారి

మండలంలో మొత్తం నాలుగు రైతు వేదికలు ఉన్నాయి. ప్రస్తుతం వాటిల్లో ఎలాంటి సమావేశాలు జరగడం లేదు. రైతులు సాగు పనుల్లో ఉండటంతో రాలేకపోతున్నారు. వడ్డేపల్లి రైతు వేదిక నిర్మించిన కాంట్రాక్టర్ పనులు సరిగా చేయలేదు. డోర్‌లు సరిగా లేకపోవడంతో వర్షం పడి అవి పాడైపోయాయి. మరుగుదొడ్ల నిర్మాణం పూర్తికాలేదు. సౌకర్యాలు సరిగా కల్పించకముందే అప్పగించారు. సౌకర్యాలు లేకపోవడంపై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చాము.

వీడియో కాన్ఫరెన్స్‌లతో వినియోగంలోకి వచ్చేనా..?

కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల పలు రైతు వేదికల్లో రైతు నేస్తం పేరిట వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. నూతన సాగు విధానాలతో పాటు, రైతులకు ఇతరాత్ర సహకారం అందించేందుకు వినూత్నంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాస్త్రవేత్తలతో, అధికారులతో మాట్లాడే అవకాశం కల్పించింది. తొలిసారిగా కొన్ని రైతు వేదికలకే పరిమితం కాగా, దశల వారీగా మిగతా రైతు వేదికల్లో సైతం అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అలా చేస్తే రైతు వేదికలకు మహార్దశ వచ్చే అవకాశం ఉందని రైతులు భావిస్తున్నారు.

స్కూళ్లల్లో మధ్యాహ్న భోజనం బంద్

- నేటి నుంచి సమ్మెలోకి మధ్యాహ్న భోజన కార్మికులు



మాట్లాడుతున్న కార్మికులు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం చెల్లించవలసిన బకాయి వేతనాలను బిల్లులను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ నేటి నుండి మధ్యాహ్న భోజనం బంద్ నిర్వహిస్తున్నట్లు మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు గురువారం తెలిపారు. నేటి నుండి వారు సమ్మెబాట పట్టనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం నాగిరెడ్డిపేట్ మండల అధ్యక్షుడు రియాజుద్దీన్ మాట్లాడుతూ పెంచిన వేతనాలను ఏప్రిల్ 2022 నుంచి అమలు చేయాలని మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రతి విద్యార్థికి 25 రూపాయలు చొప్పున స్లాబ్ రేటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే గ్యాస్ గుడ్లను ప్రభుత్వం సరఫరా చేయాలని కార్మికులకు పిఎఫ్ ఈఎస్ఐ ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని మధ్యాహ్న భోజన పథకాన్ని స్వచ్ఛంద సంస్థలకు అందించే ప్రయత్నం మానుకోవాలని కార్మికులను అక్రమంగా తొలగించరాదని అలాగే ప్రతి నెల ఐదవ తేదీన బిల్లులు వేతనాలు మంజూరి చేయాలని డిమాండ్ చేశారు. గత ఎనిమిది నెలలుగా బిల్లులు రాగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో బాలమణి. వెంకటి. సుజాత. సునీత తదితరులు పాల్గొన్నారు.

శుద్ధి జలంతోనే ఆరోగ్యం

- శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి



నీటి శుద్ధి ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న డా. పైడి ఎల్లారెడ్డి

నవతెలంగాణ-లింగంపేట్

గ్రామీణ ప్రాంత మారుమూల ప్రాంతాలకు చెందిన ప్రజలు శుద్ధి జలాలకు అలవాటు పడాలని అప్పుడే ఆరోగ్యంగా ఉంటారని ప్రముఖ శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి అన్నారు. గురువారం లింగంపేట్ మండలంలోని ముంబాజీపేట్ తాండ గ్రామంలో ప్రముఖ శాస్త్రవేత్త డా. పైడి ఎల్లారెడ్డి తాగునీటి శుద్ధీకరణ ప్లాంట్ ను బహూకరించి ప్రారంభించారు. ఇప్పటి వరకు 150 పైగా గ్రామలలో తాగునీటి శుద్ధీకరణ ప్లాంట్‌లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పార్టీలకు అతీతంగా సేవా కార్యక్రమాలు చేస్తానన్నారు. జిల్లా వ్యాప్తంగా నీటి శుద్ధి ప్లాంటేషన్లను ఏర్పాటు చేసి ప్రజలకు మంచినీరు తాగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తాండ పెద్దలు బాల్ రాం నాయక్, అనస్ రావు నాయక్, దేవి సింగ్, సామ్లు నాగిరెడ్డిపేట్ ఎంపీపీ దివిటి రాజదాస్ బాల్‌రెడ్డి, తిమ్మరెడ్డి, విఠల్ సత్యనారాయణ రెడ్డి తోట సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ అకాడమీ చైర్మన్‌కు సన్మానం



చైర్మన్‌ను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-దోమకొండ

తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తాహెర్‌బిన్ హందాన్‌ను జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ ఆయనను సన్మానించారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తాహెర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం, సీఎం రేవంత్ రెడ్డి తన పై నమ్మకం ఉంచి నియమించినందుకు మైనారిటీ ల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. యూత్ కాంగ్రెస్ పార్టీ నుండి అంచలంచెలుగా ఎదిగి రాష్ట్రస్థాయి పదవిలో ఉండడం గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ పార్లమెంట్ యూత్ అధ్యక్షులు ఇలియాస్, దోమకొండ పట్టణ అధ్యక్షుడు సీతారాం మధు, నాయకులు పందిరి మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

- 15 నుంచి 30 వరకు గాలికుంటు నివారణా టీకాలపై క్యాంప్‌లు

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండలంలో ఈనెల 15 నుండి 30వ తేదీ వరకు పశువులకు నిర్వహించే గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాలను పశువులదారులు సద్వినియోగం పరుచుకోవాలని పశు వైద్య డాక్టర్ బండి వార్ విజయ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో గ్రామాల వారిగా నిర్వహించే గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాలు ఈ విధంగా ఉన్నాయి. ఈ నెల 15న మద్నూర్, మేనూర్, 16న అవల్గావ్ , శేఖపూర్ ,18న పెద్ద తడగూర్, పెద్ద ఎక్లారా, 19న చిన్న తడగూర్ ,చిన్న ఎక్లారా, 24 హెచ్ కెలూరు ,లచ్చన్, 21న సలాబత్పూర్, సుల్తాన్ పేట్, 22న పెద్ద షక్కర్గ, రుశేగావ్, 23న చిన్న షక్కర్గా, కొడిచరా, 26న తడి ఇప్పరుగా, దన్నూర్, 27న గోజే గావ్, సోమూర్, 28న సోనాల, రాచూర్, 29న అంతాపూర్, కరగ్ గ్రామాల్లో శిబిరాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కావున పశువులు ఉన్న రైతులు శిబిరాలను వినియోగించి తమ పశువులకు టీకాలు వేయించుకోవాలని సూచించారు.

ఇసుక వేలంపాట

నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద మండలంలోని మంజీర పరివాహక ప్రాంతం నుండి అనుమతులు లేకుండా తరలిస్తున్న 10 ఇసుక ట్రాక్టర్లను అధికారులు పట్టుకొని కేసులు నమోదు చేశారు. పట్టుకున్న డాక్టర్లలోని ఇసుకను బిచ్కుంద పోలీస్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం ఉదయం వేలంపాట నిర్వహిస్తున్నట్లు తహసిల్దార్ సురేష్ ప్రకటన ద్వారా తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈ వేలం పాటలో పాల్గొనాలని ఆయన కోరారు.

లింగంపేట్ చేరుకున్న విజయ సంకల్పయాత్ర

నవతెలంగాణ-లింగంపేట్

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించిన విజయ సంకల్ప యాత్ర గురువారం లింగంపేట్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు మాసుల శ్రీనివాస్ మాట్లాడుతూ దేశానికి మోడీ మరోసారి ప్రధానమంత్రి కానున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో దత్తు రాములు, మండల ప్రధాన కార్యదర్శి వడ్ల రామచందర్, బొల్లారం సాయిలు, రాజారాం, సాయిలు, మేదర్ ప్రసాద్, రాజారాం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు



విద్యార్థులకు బ్లడ్‌గ్రూప్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నవతెలంగాణ-సదాశివనగర్

రోటరీ క్లబ్ కామారెడ్డి ఆధ్వర్యంలో అడ్లూర్ ఎల్లారెడ్డి ప్రభుత్వ పాఠశాలలో 200 మంది విద్యార్థులకు రక్తనమున పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అధ్యక్షుడు పాలబోయిన సత్యం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ బ్లడ్ గ్రూప్ ఏ రకానికి చెందినదో తెలుసుకోవాలన్నారు. తద్వారా భవిష్యత్తులో రక్తదాతగా ఆదుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి తోరణాల సుధాకర్, క్లబ్ సభ్యులు హరికృష్ణ, చింతల లక్ష్మీపతి, వెంకటరమణ, జైపాల్ రెడ్డి, దత్తాత్రి, గ్రామ మాజీ వార్డు మెంబర్ మోసర్ల శ్రీకాంత్ రెడ్డి,ఆకుల లింగం, వెంకంపల్లి రాజేందర్, బొల్లిపల్లి రాములు,కుమ్మరి శ్రవణ్, రంగమోహన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహారావు, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కార్పొరేషన్లలో కుమ్మరులకు దక్కని చోటు

- ఆర్థికంగా వెనుకబడటమే గుర్తింపు లేకపోవడానికి కారణమా?

నవతెలంగాణ-కామారెడ్డి



మనిషి పుట్టుక నుంచి మట్టిలో కలిసే వరకు కుండ లేనిది ఏ పని చేయరాదు చేయలేరు. అలాంటి కుండలు చేసే వారికి సమాజంలో గుర్తింపు లేకుండా పోయింది. ఇటీవల 16 కులాలకు కార్పొరేషన్లు కేటాయించి కుమ్మర కులస్తులకు కార్పొరేషన్ కేటాయించకపోవడం కుమ్మరులను అవమానించినట్లే అవుతుందని ఆ కులస్తులు వాపోతున్నారు. మనిషి పుట్టినప్పుడు మాయముంత నుంచి మృతి చెంది కాటిలో కాల్చేటప్పుడు సైతం ఆ కుండతో నీరు పోసే దహన సంస్కారాల నిర్వహిస్తారు. అంతటి ప్రాముఖ్యత గల కుండలు తయారు చేసే కుల వృత్తి చేసే కుమ్మరులకు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయకపోవడం అన్యాయమని పలువురు కుమ్మరులు పేర్కొంటున్నారు. వివిధ కులాలకు మూడు రకాలుగా విభజించి, ఆర్థికంగా వెనుకబడిన తరగతులు, మూడు ప్రత్యేక కార్పొరేషన్లు, ఏ ఒక్క దాంట్లో కుమ్మరులను చేర్చకపోవడం కుమ్మర్లను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అవమానించినట్లేనని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా తమకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తెలంగాణ కుమ్మారులు కోరుతున్నారు.

మమ్మల్ని గుర్తించి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొన్ని కులా లకు కార్పొరేషన్ కేటాయి ంచి మా కులానికి కార్పొరేషన్ కేటాయి ంచకపోవడంతో మా కులం అభివృద్ధి ఇప్పటికే వెనుకబడిపోయింది. ఇప్ప టికైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మా కుమ్మర కులానికి కార్పొరేషన్ ఏర్పాటు చేసి మే ము ఆర్థికంగా ఎదగడానికి సహకరించాలి.

- కామారెడ్డి కుమ్మర సంఘం జిల్లా అధ్యక్షుడు రాములు

మంత్రి మండలి

ఆమోదించిన కార్పొరేషన్లు

1.ముదిరాజ్ కార్పోరేషన్
2.యాదవ కుర్మా కార్పోరేషన్
3.మున్నూరు కాపు కార్పోరేషన్
4.పద్మశాలి కార్పోరేషన్
5.పేరిక (పురగిరి క్షత్రియ) కార్పోరేషన్
6. లింగాయత్ కార్పోరేషన్
7. మేర కార్పోరేషన్
8. గంగపుత్ర కార్పోరేషన్

ఆర్థికంగా వెనుకబడిన తరగతులు

9. ఈబీసీల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు
10. ఆర్య వైశ్య కార్పోరేషన్
11. రెడ్డి కార్పోరేషన్
12. మాదిగ, మాదిగ ఉప కులాల కార్పోరేషన్
13. మాల, మాల ఉప కులాల కార్పోరేషన్

మూడు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు

14. ఆదివాసీ కార్పోరేషన్ (కొమురం భీం)
15. సంత్ సేవాలాల్ లంబాడీ కార్పోరేషన్
16. ఏకలవ్య కార్పోరేషన్

హోరాహోరీగా వేలం పాట

- తై బజార్ వేలం వాయిదా

నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ తై బజార్, గొర్రెల మేకల, పశువుల దాకల చిట్టి వేలంపాట హెూరా హెూరీగా సాగింది. గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారి కమలాకర్ అధ్యక్షతన సోమవారం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన వేలం పాటను దక్కించుకునేందుకు పలువురు ఔత్సాహికులు నువ్వా నేనా అన్న చందంగా పోటీ పడ్డారు. తై బజార్ వాయిదా పడ్డప్పటికీ గొర్రెలు, మేకలు , పశువుల దాఖల చిట్టి లకు వేలంపాట నిర్వహించారు.



వేలం పాట పాడుతున్న ఔత్సాహికులు

2024 - 25 సంవత్సరమునకు గాను వేలంపాట నిర్వహించగా 9 మంది కాంట్రాక్టర్‌లు రెండు లక్షల ధరావత్ సొమ్ము డిపాజిట్ చేసి వేలం పాటలో పాల్గొన్నారు. ముందుగా తై బజార్ వేలం పాటకు గాను పంచాయతీ సిబ్బంది 20 లక్షల సర్కార్ సవాల్ పాట పాడగా మండల కేంద్రానికి చెందిన వడ్ల రవి , మంద శంకర్ , బాన్సువాడ రామా గౌడ్ , గాజుల పాష ల మధ్య హెూరాహెూరీగా 10 లక్షల రూపాయల పాటతో మొదలై చివరి క్షణములో వడ్ల రవి 12 లక్షల 15 వేల రూపాయల పాటతో వాయిదా పడింది. అనంతరం గొర్రెలు మేకల సర్కార్ సవాల్ 20 లక్షల రూపాయలు నిర్ణయించగా దయ్యపు సాయికుమార్ , బాన్సువాడ నాటకారి రాజేష్ , ఎల్లారెడ్డి కి చెందిన బేలూరి నారాయణ , బాన్సువాడ కు చెందిన రామా గౌడ్ ల మధ్య చతుర్ముఖ పోటీతో నువ్వా నేనా అన్నచందంగా కొనసాగగా చివరి క్షణములో బాన్సువాడకు చెందిన రామా గౌడ్ 7 లక్షల 34 వేల రూపాయల పాట పాడగా ఆయనపై బాన్సువాడ కు చెందిన నాటకారి రాజేష్ 7 లక్షల 35 వేల రూపాయల పాట పాడి గొర్రెల మేకల సంతను దక్కించుకున్నారు.

పశువుల దాఖలా చిట్టికి గాను 20 లక్షల సర్కార్ సవాల్ గాను ఎల్లారెడ్డి కి చెందిన వేలూరి నారాయణ , మండల కేంద్రానికి చెందిన పత్తి హరీష్ , దయ్యపు సాయికుమార్ ల మధ్య త్రిముఖ పోటీ నిర్వహించినప్పటికీ ఎల్లారెడ్డి బేలూరి నారాయణ 4 లక్షల 75 వెల రూపాయల పాట పాడగా ఆయనపై మండల కేంద్రానికి చెందిన పత్తి హరీష్ 4 లక్షల 76 వేల రూపాయల పాట పాడి పశువుల దాఖలా చిట్టిని కైవసం చేసుకున్నాడు. కాగా వాయిదా పడిన తై బజార్ వేలం పాటను తిరిగి 19 న చేపట్టనున్నట్లు పంచాయతీ సెక్రెటరీ యాదగిరి పేర్కొన్నారు. కార్యక్రమములో ఎం పి ఓ బ్రహ్మం , కాంగ్రెస్ పార్టీ నాయకులు బొడ్ల రాజు , ఏనుగండ్ల శ్రీనివాస్ రెడ్డి , చిప్ప శివ , దాకూరి వెంకట్ రెడ్డి , పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

స్వయం పాలనలో అలరించిన విద్యార్థులు



స్వయం పాలనలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని కోమటిపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. ఐదవ తరగతికి చెందిన విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి వివిధ తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించి అలరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రాజేందర్ మాట్లాడుతూ విద్యార్థులు బోధనా సామర్థ్యం చాలా బాగుందని కొనియాడారు. పాఠశాల ఉపాధ్యాయులు లక్ష్మణరావు మాట్లాడుతూ పాఠశాల నిర్వహణ చక్కగా ఉందని, విద్యార్థులు ఉపాధ్యాయులుగా చాలా చక్కగా ఆకట్టుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పుట్టపావని , ఉపాధ్యాయులుగా దర్ని మధు, కోకట్ల మధు, అనిత, మేఘన, చరణ్ తేజ, ఆదిత్యలు విద్యార్థులకు పాఠాలు బోధించారు. అటెండర్‌గా ఆనంద్ విధులు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-మాక్లూర్


పనులను ప్రారంభిస్తున్న ఎంపీటీసీ

మండలంలోని మదన్ పల్లి గ్రామంలోని ఒడ్డెర కాలనీలో సీసీ రోడ్డు పనులను ఎంపిటిసి గోవూరి ఒడన్న గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రూ. నాలుగు లక్షల నిధులతో సిసి రోడ్డు, డ్రైనేజ్ నిర్మాణ పనులను గురువారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేష్, మాజీ ఎంపిటిసి స్వామి, హన్మండ్లు, జి. లింగన్న, గంగాధర్, లచన్న, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గృహజ్యోతికి దరఖాస్తు చేసుకోవాలి

- విద్యుత్ ఏఈ రవి

నవతెలంగాణ-ముప్కాల్

అర్హులైన లబ్ధిదారులు గృహజ్యోతికోసం దరఖాస్తు చేసుకోవాలని విద్యుత్తు అధికారి ఏఈ రవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జీరో విద్యుత్ బిల్లు రాని వారు అపోహపడొద్దని సూచించారు. తెల్లరేషన్ కార్డ్ ఉండి, ఆధార్ కార్డు, ప్రజాపాలన రసీదు, ఫోన్ నంబరుతో స్థానిక మండల అభివృద్ధి కార్యాలయంలో దరఖాస్తును అందజేయాలని అన్నారు. అన్ని విధాలా అర్హతలు ఉంటే అట్టి దరఖాస్తు దారునికి మరుసటి రోజు గృహజ్యోతి '0' బిల్లు వస్తుందని వెల్లడించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో జీరో బిల్లు రాని వారు, అర్హులైన వారు గృహజ్యోతికి దరఖాస్తులు చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.

వెల్‌నెస్ సెంటర్‌లో డాక్టర్ పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా కేంద్రంలోని ఈజేహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్‌లో ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టును పొరుగు సేవల పద్ధతిన భర్తీ చేసేందుకు ఆసక్తి, అర్హత కలిగిన ఎంబీబీఎస్ ఉత్తీర్ణులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని వెల్ నెస్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణవేణి తెలిపారు. నియామకం అయిన వారికి నెలకు రూ. 58,500 చొప్పున వేతనం చెల్లించబడుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర వైద్య మండలిచే గుర్తింపు పొందిన ఎంబీబీఎస్ పూర్తి చేసిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. అర్హత కలిగిన వారు ఈ నెల 16వరకు జిల్లా కేంద్రంలోని పాత నగర పాలక సంస్థ కార్యాలయం సమీపంలోని వెల్ నెస్ సెంటర్‌లో సంబంధిత ధృవపత్రాలను జతపర్చిన దరఖాస్తులను అందజేయాలని మెడికల్ ఆఫీసర్ కృష్ణవేణి సూచించారు.

కానిస్టేబుల్‌కు నివాళ్లు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ పోలీస్ కమిషనరేటు పరిధిలోని ఆర్మ్‌డ్ రిజర్వు విభాగం యందు విధులు నిర్వహిస్తున్న పోలీసు కానిస్టేబుల్ పల్లే శంకర్ ఈనెల 12న రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ 13న మృతిచెందారు. ప్రభుత్వ హాస్పటల్‌లో మృతదేహానికి గురువారం నిజామాబాద్ అదనపు పోలీస్ డిసిపి (ఎఆర్) డి.శంకర్ నాయక్ పుష్పగుచ్ఛాలతో నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. పల్లే శంకర్ 1990లో కానిస్టేబుల్‌గా చేరారు. వీరికి ఒక కుమారుడు, ఒక కూతురు ఉన్నారు. ఎఆర్ ఏసీపీ కె. నాగయ్య, రిజర్వు ఇన్‌స్పెక్టర్ శల్ వెంకటి, ఆర్ఎస్ఐ దత్తు, జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు షకీల్ పాషా, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

19న తైబజారు వేలం

నవతెలంగాణ-బాల్కొండ

బాల్కొండ గ్రామపంచాయతీ తైబజార్ వేలం 2024-2025 సంవత్సరానికి ఈనెల 19న మంగళవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు గురువారం గ్రామపంచాయతీ కార్యదర్శి రజనీకాంత్ రెడ్డి తెలిపారు. వీక్లీ మార్కెట్, రోజువారి సంత, దాఖలాల చిట్టి వేలంలలో పాల్గొనేవారు 50 వేల రూపాయలు డిపాజిట్ చేసి వేలంపాటలో పాల్గొనాలని కార్యదర్శి కోరారు. ఈ వేలం ప్రత్యేక అధికారి విజయ్ భాస్కర్ రెడ్డి సమక్షంలో జరుగుతుందని కార్యదర్శి తెలిపారు.

మాక్లూర్‌లో పారిశుధ్య పనులు

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలో ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామంలోని పేరుకు పోయిన పారిశుధ్య పనులను గ్రామ పంచాయతీ కార్యదర్శి రాకేష్ గురువారం సిబ్బందితో చేయించారు. ఎక్కడ కూడా పారిశుధ్య సమస్యలు ఉండకూడదనే ఉద్యేశంతో పనులను చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

20న ఏర్గట్లలో తైబజార్ వేలం

నవతెలంగాణ-ఏర్గట్ల

ఏర్గట్ల గ్రామపంచాయతీ వారు 2024-25 సంవత్సరానికి గాను నిర్వహించే తైబజార్ వేలంలో భాగంగా కూరగాయలు, పశువుల సంత వేలంలో ఆసక్తి గల వారు పాల్గొనవచ్చని గ్రామపంచాయతీ కార్యదర్శి జాకీర్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. వేలం ఈ నెల 20న ఉదయం 10 గంటలకు గ్రామపంచాయతీ కార్యాలయంలో జరుగుతుందని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనేవారు పశువుల సంతకు 10 వేలు, కూరగాయల మార్కెట్‌కు 10 వేల డిపాజిట్ వేరువేరుగా చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

కమ్యూనిస్టు సిద్ధాంతకర్త కారల్ మార్క్స్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కమ్యూనిస్టు సిద్ధాంతకర్త కారల్ మార్క్స్ అని ఆకుల పాపయ్య అన్నారు. కామ్రేడ్ కారల్ మార్క్స్ 141 వర్ధంతి సందర్భంగా సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో గురువారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పార్టీ కార్యాలయంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆకుల పాపయ్య మాట్లాడుతూ ప్రపంచ కార్మిక వర్గానికి మార్క్స్ సిద్ధాంతాన్ని అందించాడని, ప్రపంచంలో మార్పులు సహజమని సమాజం పురోగమిస్తుందని వివరించారని తెలిపారు. శ్రామిక వర్గ సిద్ధాంత ప్రభావం వల్ల ప్యారిస్ కమ్యూన్‌లో రష్యాలో విప్లవం వచ్చిందని , ప్రపంచంలో హిట్లర్, రజాకార్ల దుర్మార్గులకు వ్యతిరేకంగా మార్క్స్ చెప్పిన సిద్ధాంత చైతన్యంతో పోరాటం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి దాసు, డివిజన్ కార్యదర్శి వేల్పూర్ భూమయ్య, జిల్లా నాయకులు భుమన్న, కాజా మొయినుద్దీన్, ప్రజాసంఘాల నాయకులు సాయి రెడ్డి , కృష్ణ గౌడ్, సాయినాథ్, సత్యం, శివకుమార్, జన్నారపు రాజేశ్వర్, పోషెట్టి, మురళి, ప్రిన్స్, దేవస్వమి, గంగాధర్, సుప్రియ, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి పశువులకు ఎఫ్ఎండి వ్యాక్సిన్

- పశువైద్యాధికారి శిరీష

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

పశువులకు ఎఫ్ఎండి వ్యాక్సిన్ నేటినుంచి వేయనున్నట్టు మండల పశు వైద్యాధికారి శిరీష తెలిపారు. ఈనెల 15 నుంచి ఏప్రిల్ 6 వరకు ప్రతిరోజు ఒక విలేజ్ చొప్పున పశువులకు ఎఫ్ఎండి వ్యాక్సిన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండలంలోని పశువులు గల రైతులు వినియోగించుకోవాలని తెలిపారు.

వినియోగదారులు మేల్కొనాలి

- అవగాహనే ఆయుధం
- నేడు ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం

నవతెలంగాణ-ఆర్మూర్

కల్తీ సరుకులు, నాసిరకం వస్తువులు, నాణ్యత లేని పరికరాలు సాంకేతికంగా మనిషి ఎంత ఎదుగుతున్న తమకు అవసరమైన వస్తువుల కొనుగోలులో మాత్రం ప్రజలకు మోసాలు అడుగడుగునా జరుగుతూనే ఉన్నాయి. సగటు మధ్యతరగతి వినియోగదారులు తాము పొందిన సేవలు, కొనుగోలు చేసిన వస్తువులలో లోపాలు ఉన్నట్లయితే నష్టపోవడం తప్ప చేసేదేమి లేదని బాధపడేవారు. కోకొల్లలు. తమ కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయని అవగాహన లేక తరచూ మోసపోతు మదన పడుతున్న వినియోగదారులు అనునిత్యం తారస పడతారు. వారి హక్కుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు, కోర్టులు సంగతి చాలామందికి తెలియని విషయం.. స్థిరాస్తి రియల్ ఎస్టేట్ వ్యాపారంలోనే ఒక స్థలాన్ని చూపి మరో స్థలాన్ని విక్రయించే వారు ఎక్కువయ్యారు. అంతేకాకుండా ఒకే స్థలాన్ని ఐదుగురికి విక్రయించే రియల్ ఎస్టేట్ బ్రోకర్లు పెరిగిపోయారు. నేడు ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా కథనం..

ఈరోజు ఎందుకంటే..

యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా అధ్యక్షునిగా పనిచేసిన జాన్ఎఫ్ కెనడా 1962లో చారిత్రక ప్రకటన చేసిన రోజుగా మార్చి 15 గుర్తింపు పొందింది. కెనడా నిర్వచనం ప్రకారం వినియోగదారుడు అంటే మనమందరం ఆర్థిక వ్యవస్థలో అతిపెద్ద ఆర్థిక, వర్గం రక్షణ, సమాచారం, ఎంపిక, విజ్ఞప్తి ఇవి ప్రకటించిన హక్కులు. 1972లో అంతర్జాతీయ వినియోగదారుల సంఘాల సంస్థ ప్రాంతీయ సంచాలకులు అన్వర్ ఫజల్ మార్చ్ 15వ తేదీని ప్రపంచ వినియో గదారుల హక్కుల దినోత్సవంగా జరుపుకోవాలని తీర్మానించారు. దీంతో అప్పటినుంచి ఈ దినోత్సవం కొనసాగుతోంది.

వినియోగదారుల హక్కులు..

వినియోగదారులు కొన్ని వస్తువులు పొందే సేవల నాణ్యత, ప్రమాణం, ధరల గురించి సంపూర్ణ సమాచారం పొందవచ్చు. వినియోగదారులు వస్తువులు సేవలు తక్షణ అవసరాలు తీర్చగానే కాకుండా దీర్ఘకాలం ఎలా ఉండాలి.. అవి వినియోగదారుల ఆస్తులకు నష్టం కలిగించ కూడదు.. ఆ భద్రత పొందడానికి కొన్ని వస్తువుల నాణ్యతను నిర్ధారించుకోవాలి. వీలైనంతవరకు ఐఎస్ఐ మార్క్, హాల్ మార్క్ వంటి నాణ్యత గల వస్తువులను కొనుగోలు చేయాలి. అనేక రకాల వస్తువులను సేవలకు తగిన సరసమైన ధరల్లో ఉండటం వినియోగదారుల హక్కు, వినియోగదారులు, వినియోగదారుల వేదికపై తమ అభిప్రాయాలు వినిపించవచ్చు. అన్యాయమైన, వాణిజ్య విధానాలు, మోసపూరిత పద్ధతుల నుంచి న్యాయబద్ధమైన రక్షణ పొందడం వినియోగదారుల హక్కు.

ఎవరెవరు ఫిర్యాదు చేయొచ్చు?

వినియోగదారుల ఫోరాన్ని ఎవరెవరు సాంప్రదించవచ్చంటే ఎరువుల కల్తీ, తూకం తక్కువ, నాసిరకం విత్తనాలు, నకిలీ పురుగుల మందులు, వీటి బారిన పడి నష్టపోతున్న రైతాంగం, విద్యుత్ కోత, నెలకోసారి స్లాబ్ మార్చి అధిక చార్జీలు వసూలు చేసే విద్యుత్ శాఖ తీరుతో నష్టపోయేవారు. కొన్ని వస్తువులు నాణ్యత లేకపోయినా, చెడిపోయిన, చౌక ధరల డీలర్లు సకాలంలో సరుకులు పంపిణీ చేయకపోతే, సినిమా థియేటర్లలో సౌకర్యాలు లేకపోయినా, పరిశుభ్రత లేకున్నా వైద్య సేవలో మున్సిపాలిటీలో లోపాలున్న మినరల్ వాటర్ పేరుతో సాధారణ వాటర్‌ను అమ్ముతూ ప్రజల ఆరోగ్యాలతో ఆడుకుంటున్న, కల్తీ పాలు అమ్ముతున్న వినియోగదారుల ఫోరాన్ని సాంప్రదించవచ్చు.

ఫిర్యాదు ఎలా చేయాలి?

ఏదైనా వస్తువు కొనుగోలు చేసినప్పుడు నాణ్యత లేదని, ధర ఎక్కువగా తీసుకున్నాడని, ముగింపు తేదీ గడిచిందో తూకంలో తేడా ఉందని నిర్ధారణకు వచ్చినప్పుడు జిల్లా కేంద్రంలోని ఉండి వినియోగదారుల ఫోరంలో నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదు చేసే విధానం చాలా సులభం.. తెల్ల కాగితంపై వివరాలు రాసి ఫిర్యాదు చేయవచ్చు.. పోస్టు ద్వారా కూడా పంపవచ్చు.. తూకంలో మోసంపై స్థానిక తూనికల కొలతల శాఖ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. చర్యలు తీసుకోకపోతే వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించవచ్చు.

ఫిర్యాదులు పేర్కొనవలసినవి..

ఫిర్యాదుదారుని పూర్తి పేరు చిరునామా పేర్కొనాలి. అవతలి పార్టీ పూర్తి పేరు, చిరునామా, ఫిర్యాదు చేయడానికి గల కారణాలు ఎప్పుడు ఏ విధంగా నష్టం జరిగిందో పేర్కొనాలి. దానికి సంబంధించిన డాక్యుమెంట్లు రసీదు ఇతర వివరాలు జతచేస్తూ 20లక్షల విలువ వరకు జిల్లా ఫోరంలో 20లక్షలకు మించి కోటి వరకు రాష్ట్ర కమిషన్‌లో ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. కొనుగోలు చేసిన లేదా నష్టం జరిగిన నాటి నుంచి రెండేళ్లలోపు ఫిర్యాదు చేయవచ్చు. ఆలస్యానికి తగిన కారణాలు చూపితే రెండేళ్ల దాటిన తర్వాత ఫిర్యాదు చేయడానికి అవకాశం ఉంటుంది.

జిల్లాల్లో..

వినియోగదారులకు న్యాయం చేయడానికి డిసెంబర్ 24,1986లో పార్లమెంటులో వినియోగదారుల హక్కుల చట్టాలు తీసుకొచ్చారు. అనంతరం జిల్లాల్లో వినియోగదారుల ఫోరాన్ని 1987లో ఏర్పాటు చేయగా పూర్తిస్థాయి ఫోరం మాత్రం 1993లో ప్రారంభమైంది. మోసపోయామని భావించే వినియోగదారులు తాము కొనుగోలు చేసిన సేవలు, బిల్లులను తీసుకొని జిల్లా ఫోరంలో సంప్రదిస్తే సంబంధిత వినియోగదారులకు పూర్తి న్యాయ సహాయ సహకారాలు అందిస్తారు. వినియోగదారుడు తమకు జరిగిన నష్టాన్ని ఫోరం దృష్టికి తీసుకెళ్లొచ్చు. ఇతర వివరాలకు జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం అధ్యక్షులు రాజేశ్వర్ సెల్ నంబర్ 9396451999 నంబర్‌కు సంప్రదించవచ్చు. జిల్లా వినియోగదారుల కమిషన్ కోర్టులో ప్రస్తుతం 167 కేసులు పెండింగ్లో ఉన్నవి.

నీటి వ్యాపారంలో దోపిడీ..



ఉమ్మడి జిల్లాలతో పాటు పలు డివిజన్ కేంద్రాలలోనూ ఐఎస్ఐ ముద్ర లేకుండా నీటి వ్యాపారం జరుగుతోంది. వినియోగదారులను మోసం చేస్తున్న వాటర్ ప్లాంట్ల పైన సంబంధిత శాఖ అధికారులు దాడులు చేయాలి. అక్రమంగా నీటి వ్యాపారం చేస్తూ ప్రజలను దోచుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలి.

ఎస్ వెంకటేష్, వినియోగదారుడు, మామిడిపల్లి.

నేరుగా ఫిర్యాదు చేయవచ్చు..



వినియోగదారులు ఎలాంటి మోసాలకు గురైన నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. ప్రజల ఆరోగ్యాలతో ఆడుకుంటున్న వారిపై ఫిర్యాదు చేస్తే తగు చర్యలు తీసుకుంటాం. వినియోగదారులు ఎలాంటి మోసాలకు గురైన జిల్లా కేంద్రంలోని వినియోగదారుల కేంద్రంలో ఫిర్యాదు చేయవచ్చు.

రాజేశ్వర్, చైర్మన్ జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం, నిజామాబాద్

మహిళా సంఘాల బలోపేతానికి కాంగ్రెస్ పార్టీ కృషి

- డిసిసి ప్రధాన కార్యదర్శి కుంట రమేష్

నవతెలంగాణ భీంగల్


సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న డిసిసి ప్రధాన కార్యదర్శి

రాష్ట్రంలో మహిళా సంఘాల బలోపేతమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు వెళుతుందని డిసిసి ప్రధాన కార్యదర్శి కుంట రమేష్ అన్నారు. గురువారం మండలంలోని మెండోరా గ్రామ డ్వాక్రా మహిళా సమాఖ్య, మెండోరా గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కుంట రమేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని మహిళా సంఘాలను మరింత బలోపేతం చేయడానికి మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడంలో భాగంగా రానున్న రోజుల్లో మహిళలకు వడ్డీ లేని రుణాలను అందించనున్నారని తెలిపారు. దురదృష్టవశాత్తు మహిళా సంఘ సభ్యురాలు చనిపోతే, ఆర్థికంగా ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి పది లక్షల రూపాయల బీమా సౌకర్యం పథకం సీఎం ప్రారంభించారని తెలిపారు. ఉచిత సిలిండర్ పథకం, గృహ జ్యోతిలో భాగంగా జీరో బిల్లులను చూసి మహిళలు ఎంతో సంతోష పడుతున్నారని అన్నారు. త్వరలోనే పేదలకు తెల్ల రేషన్ కార్డులు అందజేయడం జరుగుతుందని, ఇల్లు లేని పేద మధ్యతరగతి మహిళలకు ఇందిరమ్మ పథకంలో భాగంగా ఇళ్లను నిర్మించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఇందిరా క్రాంతి పథం, సీసీలు, కుంట శ్రీనివాస్ పురస్తు నరేష్, మహిళా సమాఖ్య సభ్యులు పుష్ప, వినోద, సుమలత, యాస్మిన్, 200 మంది మహిళా సంఘ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు రాజేశ్వర్గౌడ్, ఉపాధ్యక్షులు గౌరు లింబాద్రి, మండల నాయకులు, పల్లె శేఖర్, గంగాధర్, యూత్ కాంగ్రెస్ సెక్రెటరీ రాజేందర్ గౌడ్, సుమన్ మనోహర్ ప్రశాంత్, దిలీప్,ఆనంద్, రవి, గ్రామ కాంగ్రెస్ నాయకులు, పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్


మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

నవతెలంగాణ-ముప్కాల్

రానున్న పార్లమెంట్ ఎన్నికల వేళ గురువారం జిల్లా అడిషనల్ కలెక్టర్, బాల్కొండ నియోజకవర్గ అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి అంకిత్ మండల కేంద్రంలోని పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఎంపీ ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు ముందస్తుగా బూత్ లను క్షుణ్ణంగా పరిశీలించి, స్థానిక సమస్యలపై సమాచారాన్ని తహశీల్దార్ వనజ రాణిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాలుగు కేంద్రాలతో పాటు గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉన్న మరొక బూత్‌ను పర్యవేక్షించారు. మండల అధికారులకు తగు సూచనలను అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహమ్మద్ ముజాఫరోద్దీన్, డిప్యూటీ తహశీల్దార్ శ్రీకాంత్, ఎంపీవో భరత్ చంద్ర, ఆర్ ఐ గంగారాం, ముప్కాల్, రెంజర్ల ఈవోలు విజయ్ కుమార్, శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు గంగారాం, బిఎల్వోలు అమినా బేగం, వాణి, జ్యోతి పాల్గొన్నారు.

కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-బోధన్

బోధన్ మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ చైర్మన్ తూము పద్మావతి లబ్దిదారులకు షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిరుపేదల ఆడపిల్లల వివాహాల కోసం ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంగాధర్, కమిషనర్ వెంకట్ నారాయణ, కౌన్సిలర్లు శరత్‌రెడ్డి, రాధా కృష్ణ, పౌల్, ధూప్‌సింగ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు హరికాంత్‌చారి, పాషా మొహీనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వెయ్యి బీడీలకు పెరిన వీడీఏ అమలు చేయించాలి

- డిసిఎల్‌కు బీఎల్‌టీయూ వినతి

నవతెలంగాణ-కంఠేశ్వర్

వెయ్యి బీడీలకు పెరిన వీడీఏ అమలు చేయించాలని నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని లేబర్ ఆఫీసులో డిప్యూటీ లేబర్ కమిషనర్ (డిసిఎల్) శ్యాం సుందర్ జాదవ్‌కి తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం(బిఎల్ టీయూ) ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు, యస్, సిద్దిరాములు మాట్లాడుతూ..బీడీ కార్మికులందరికీ పెరిగిన కరువు భత్యం (వీడీఏ) ఏప్రిల్ 1నుండి అమలు చేయించాలని అన్నారు. వెయ్యి బీడీలకు రూ.11.30 పైసలు పెరిగిందని తెలిపారు. ఈ పెరిగిన కరువు భత్యం 2024 ఏప్రిల్ 01 నుండి అమలులోకి వస్తుందని తెలిపారు. నెలసరి జీతాల ఉద్యోగులైన బీడీ సార్టర్, ఆకు, తంబాకు పంచేవారు, గుమస్తాలకు, అకౌంటెంట్లకు, బట్టీవాల, చెన్నీవాల, గంపవాల, వాచ్ మెన్ లకు నెలకు 339 రూపాయల చొప్పున పెరిగిందని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు, బి.జగదీష్, జిల్లా కార్యదర్శి, సైయ్యద్, బిఎల్‌టీయూ, అధ్యక్షులు, కె. మధు, నిజామాబాదు నగర అధ్యక్షులు, పి.రాజు, తదితరులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి


పన్నులు వసూల్లు చేస్తున్న పంచాయతీ కార్యదర్శి

గ్రామంలో పేరుకుపోయిన ఇంటి పన్నుల వసూళ్లకు ఇంటింటికి తిరుగుతూ వసూళ్లు చేయడం జరుగుతుందని గ్రామ పంచాయతీ కార్యదర్శి నరేష్ అన్నారు. సంస్థాన్ సిర్నపల్లి గ్రామంలో పేరుకుపోయిన బకాయిలను వసూలు చేయడానికి పంచాయతీ సిబ్బందితో కలిసి ఇంటింటికీ తిరిగి పన్నులను వసూలు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కార్యదర్శి నరేష్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలో డబ్బులు ఉంటేనే గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, వేసవి లో తాగు నీటికి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు సహకరించి పన్నులను చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలోపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలి

- గ్రామ పంచాయతీ కార్యదర్శి రామిరెడ్డి

నవతెలంగాణ-ఎడపల్లి


పన్నులు వసూల్లు చేస్తున్న పంచాయతీ కార్యదర్శి

ఇంటి, నీటి కులాయి పన్నులు గ్రామస్తులు చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని గ్రామపంచాయతీ కార్యదర్శి రామిరెడ్డి అన్నారు. గురువారం ఇంటి, కులాయి పన్నులను వసూలు చేశారు. ఇంటి యజమానులు పన్నులు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని ఆయన గ్రామస్తులను కోరారు. ఇంటి యజమానులు 100శాతం పన్నులు చెల్లిస్తే పంచాయతీ గ్రామ పంచాయతీ ద్వారా అభివృద్ధి పనులు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఆయన వెంట కరోబార్ పద్మావతి తదితరులున్నారు.

ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు

- పలుచోట్ల బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్టింగ్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

వేల్పూర్ మండల కేంద్రంలోని స్వగృహంలో గురువారం తన పుట్టినరోజు వేడుకలను మాజీ మంత్రి, బాల్కొండ శాసనసభ్యులు వేముల ప్రశాంత్ రెడ్డి ఘనంగా జరుపుకున్నారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో భారీ కేక్ కట్ చేశారు. నియోజకవర్గంలోని ఆయా గ్రామాల నుండి తరలివచ్చిన ప్రజా ప్రతినిధులు, నాయకులు, పార్టీ శ్రేణులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పలువురు ప్రజా ప్రతినిధులు పుష్పగుచ్ఛాలను అందించి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

బాల్కొండ : మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద మండల పార్టీ అధ్యక్షుడు బద్దం ప్రవీణ్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా నాయకులు యమగంటి లింగాగౌడ్, దాసరి వెంకటేష్ కార్యకర్తల సమక్షంలో కేక్ కట్‌చేశారు. ఆలయల్లో పూజలు నిర్వహించారు.

ఏర్గట్ల: ఏర్గట్ల మండలకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి జన్మదిన వేడుకలను ఏర్గట్ల మండల నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి,స్వీట్లు పంచి ఘనంగా జరుపుకున్నారు. నియోజకవర్గానికి ఆయన చేసిన సేవలు, అభివృద్ధిని గుర్తుచేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు పూర్ణానందం, ఎంపీపీ ఉపేంధర్ రెడ్డి, జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్, ఎంపీటీసీ జక్కని మధుసూదన్, పీఏసీఎస్ చైర్మన్లు బర్మ చిన్న నర్సయ్య,పెద్దకాపుల శ్రీనివాస్ రెడ్డి, నాయకులు తుపాకుల శ్రీనివాస్ గౌడ్, బద్దం శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్లు పాల్గొన్నారు.

ముప్కాల్ : రాష్ట్ర మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం మండల కేంద్రంలోని "పడిలేచిన మర్రిచెట్టు దేవస్థానం"లో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల నడుమ నిర్వహించినట్టు పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్ రెడ్డి అన్నారు. ఎంపీపీ సామ పద్మ-వెంకట్ రెడ్డి, జడ్పీటీసీ సభ్యులు బద్దం నర్సవ్వ-నర్సారెడ్డి, టౌన్ అధ్యక్షులు పెంటు గంగాధర్, ప్రధాన కార్యదర్శి జోషి ఉమ శంకర్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమలు చేపట్టారు. మండలంలోని నాగంపేట్, రెంజర్ల, వేంపల్లి, వెంచిర్యాల, నల్లూర్, కొత్తపల్లి గ్రామాల్లో పార్టీ నాయకులు ప్రశాంత్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కో-అప్షన్ సభ్యులు, రైతు సమన్వయ సమితి సభ్యులు, వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు, మాజీ ఎంపీటీసీలు, ఉప సర్పంచులు, పార్టీ సీనియర్ నాయకులు, యువజన సంఘ నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

కమ్మర్‌పల్లి : మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం మండల పార్టీ అధ్యక్షుడు రేగుంట దేవేందర్ ఆధ్వర్యంలో బాల్కొండ శాసన సభ్యులు వేముల ప్రశాంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. రేగుంట దేవేందర్, రాష్ట్ర నాయకులు బద్దం చిన్నారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మైలారం సుధాకర్, నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్‌కట్ చేశారు. మండలంలోని వివిధ ఆలయల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గడ్డం స్వామి, నాయకులు బద్దం రాజేశ్వర్, బద్దం రాజశేఖర్, మల్యాల సుభాష్‌గౌడ్, రెంజర్ల మహేందర్, అవారి గంగారెడ్డి, కటికె శ్రీనివాస్, పాడిటి శంకర్, జంగం మహేష్, తీగల హరీష్, పాలెపు చిన్న గంగారం, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


వేల్పూర్‌లోని తన స్వగృహంలో పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన భారీ కేకును కట్ చేస్తున్న ఎమ్మెల్యే


కమ్మర్‌పల్లిలో...

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
శుక్రవారం | మార్చి 15, 2024 | www.navatelangana.com

ముదిరాజులకు ప్రత్యేక కార్పొరేషన్ ప్రకటనపట్ల హర్షం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ముదిరాజులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామని మండల కాంగ్రెస్ యువజన విభాగం అధ్యక్షుడు వినోద్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సారథ్యంలో కేబినెట్ సమావేశంలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న బిసి కులాలను గుర్తిస్తూ ప్రత్యేక కార్పొరేషన్లను ఏర్పాటు చేస్తున్నట్లుగా ప్రకటించడం అందులో ముఖ్యంగా ముదిరాజులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నట్లుగా ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మండల ముదిరాజ్ పక్షాన సీఎం రేవంత్ రెడ్డికి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నిజామాబాద్ ముదిరాజ్ మహా సభ యువజన నాయకుడు సొప్పరి వినోద్ ముదిరాజ్, డిష్ రాజు, గంగా అభిలాష్, సుధీర్ ముదిరాజ్, చింటు, ప్రేమ్ సాయి, శ్రీరామ్ సాయి, యువజన నాయకులు పాల్గొన్నారు.

ప్రజాపాలనకేంద్రంలో మౌలిక సదుపాయాల ఏర్పాటు

- నవతెలంగాణ వార్తకు స్పందన

నవతెలంగాణ- రెంజల్


లబ్ధిదారులకోసం ఏర్పాటుచేసిన కుర్చీలు, వాటర్

ప్రజాపాలన దరఖాస్తుల కోసం బారులు అనే వార్తకు స్పందించిన అధికారులు గురువారం వారికి మండల పరిషత్ కార్యాలయంలో మౌలిక సదుపాయాలను సమకూర్చారు. దరఖాస్తులు చేసుకోవడానికి విచ్చేసిన వారికి కుర్చీలు వేసి వారికి తాగునీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరు దరఖాస్తులను చేసుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. దరఖాస్తులు చేసుకోవడానికి వచ్చిన వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించినట్లు వారు పేర్కొన్నారు.

ప్రజాపాలన కేంద్రం నిరంతరం కొనసాగుతుంది

- ప్రజాపాలన కేంద్రం సందర్శించిన డిపిఓ

నవతెలంగాణ-మోపాల్


లబ్ధిదారులతో మాట్లాడుతున్న డీపీఓ

మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన సేవా కేంద్రాన్ని జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ కుమార్ గురువారం సందర్శించారు. లబ్ధిదారులకు కల్పించిన సదుపాయాల గురించి తెలుసుకున్నారు. అక్కడున్న స్థానిక ప్రజలకు ప్రజాపాలన సేవా కేంద్రం గురించి ఆయన తెలిపారు. ఇది నిరంతర ప్రక్రియ అని ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ప్రజలు అధికారులకు సహకరించాలని ఆయన కోరారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని ఎంపీడీవోకు సూచించారు. మండల కేంద్రంలో గల గ్రామపంచాయతీ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. రాబోయే ఎంపీ ఎలక్షన్స్‌ను దృష్టిలో పెట్టుకొని బూత్‌లెవల్ ఆఫీసర్లకు ఓటర్ లిస్ట్‌కు సంబంధించి పలు సూచనలు చేశారు. ఒడ్డెర కాలనీలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. గ్రామపంచాయతిలో రికార్డులను తనిఖీ చేస్తూ శానిటేషన్ గురించి పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు జారీ చేశారు. ఎంపీడబ్ల్యు వర్కర్ నరసయ్యను గ్రామపంచాయతీ పనులు చిత్తశుద్ధితో చేస్తున్నందుకు శాలువాతో సన్మానించి ప్రశంసించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ లింగం నాయక్, ఎంపి ఓ ఇక్బాల్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బంది లేకుండా చర్యలు

- మున్సిపల్ చైర్మన్ తూము పద్మావతి

నవతెలంగాణ-బోధన్



ప్రస్తుత వేసవి కాలం దృష్ట్యా పట్టణ ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టినట్టు బోధన్ మున్సిపల్ చైర్మన్ పద్మావతి తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రంజాన్ పండుగను పురస్కరించుకొని మైనార్టీ కాలనీలకు, పట్టణ ప్రజలకు ఎలాంటి తాగునీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టమన్నారు. కావున పట్టణ ప్రజలు తాగునీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పట్టణ ప్రజల తాగునీటి అవసరాల కోసం బెల్లాల్ చెరువు నింపడానికి అధికారులకు ఆదేశించారని తెలిపారు. ఆస్తి పన్ను వసూలు చేయడానికి బోధన్ మున్సిపల్ ఆధ్వర్యంలో 3 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ప్రభుత్వం పట్టణ ప్రజల సౌకర్యార్థం ఆస్తి పన్ను బకాయిలను చెల్లించడానికి 90శాతం వడ్డీ మాఫీని ప్రకటించిందని, కావున పట్టణవాసులు ఆస్తిపన్ను పాత బకాయిలు చెల్లించి వడ్డీ మాఫీ పొందాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆస్తి పన్ను బకాయిలను చెల్లించి పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్ నారాయణ, కౌన్సిలర్లు ఉన్నారు.

నేటి నుంచి గాలికుంట వ్యాధి నివారణా టీకాలు

నవతెలంగాణ-ఆర్మూర్

నేటి నుంచి వచ్చే నెల 14 వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న అన్ని గేదె జాతి, గో జాతి పశువుల్లో ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం కొనసాగుతుందని పట్టణ వెటర్నరీ అసిస్టెంట్ జియాయుద్దీన్, మండల పశుసంవర్ధక శాఖ అధికారి లక్కం ప్రభాకర్ లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల పాడి రైతులు అన్ని అపోహలను వీడి, తమ పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని కోరారు. నేడు మామిడిపల్లిలో గో జాతి గేదె జాతి పశువులకు టీకాలు ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. పాడి రైతులు, తమ పాడి పశువులకు గాలి కుంటు వ్యాధి రాకుండా, ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా టీకాలు వేయించుకోవాలని కోరారు.

ప్రజాపాలన సేవా కేంద్రం ఏర్పాటు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రం ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో సతీష్‌కుమార్ తెలిపారు. గృహజ్యోతి లబ్ధిదారుల అప్లికేషన్ స్వీకరిస్తున్నట్లు చెప్పారు. అర్హులైన వారు గృహజ్యోతికి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ బ్రహ్మానందం, తదితరులు ఉన్నారు.

నూతన గోదాం నిర్మాణానికి నిధుల మంజూరు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని కొనసముందర్ గ్రామములో గల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన గోదాము నిర్మాణం కొరకు రూ.10 లక్షలు మంజురు అయినట్లు విండో చైర్మన్ సామా బాపురెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం నిధుల మంజూరుకు సంబంధించిన పత్రాలను మాజీ మంత్రి, బాల్కొండ నియోజకవర్గం ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో విండో ఉపాధ్యక్షులు ఆకుల రాజన్న, మండల పరిషత్ ఉపాధ్యక్షులు కాలేరు శేఖర్, మాజీ సర్పంచ్ ఇంద్రాల రూప రాజేందర్, మాజీ ఉప సర్పంచ్ పేరం లింబాద్రి, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు, విండో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరిదేవి 12వ వార్షికోత్సవం

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి చౌడేశ్వరి దేవి ఆలయ 12వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణ పనుల్లో భాగంగా టైల్స్‌ను వితరణ చేసిన నటరాజ్ దంపతులను సన్మానించారు. అన్నదాన కార్యక్రమం లో సైతం స్థానికులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భూ మెని చిన్నోళ్ల రాజన్న, డాక్టర్ శివ రాములు, నడుల్లె రాజన్న, దత్తు, రవి, రాజేశ్వర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను మోసం చేస్తున్న అక్షర గ్రూప్ ఆఫ్ స్కూల్స్ : పీడీఎస్‌యూ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అక్షరా గ్రూప్ ఆఫ్ స్కూల్స్ విద్యార్థులను మోసం చేస్తున్నారని పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ అన్నారు. పిడిఎస్‌యూ ఆధ్వర్యంలో నిజామబాద్ నగరంలో అక్షర గ్రూప్ ఆఫ్ స్కూల్స్ బ్యానర్స్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి అనుమతులు లేకుండా పది నెలల నుండి అక్షర గ్రూప్ ఆఫ్ స్కూల్స్ పేరుతో విద్యార్థుల దగ్గర అడ్మిషన్ తీసుకొని బోనఫైడ్స్ మాత్రం సెయింట్ థెరిస్సా స్కూల్ పేరు మీద ఇస్తున్నారని తెలిపారు. కార్పొరేట్ హైస్కూల్ అనే పేరుతో లక్షల రూపాయలు విద్యార్థులు నుండి వసూలు చేస్తూ కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదని అన్నారు. ఫీజులు కట్టని వారిని మానసిక ఇబ్బందులకు గురిచేస్తున్నారని, రెండు నెలలుగా స్కూలుకు సంబంధించిన పలు విషయాలు సంబంధిత ఎంఈఓకు తెలిపిన ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. అనుమతులు లేని వివిధ పేర్లతో అడ్మిషన్లు తీసుకొని విద్యార్థులను మోసం చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ప్రిన్స్, దేవిక, మనోజ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ప్యాడ్స్, పెన్నులు, వాటర్ బాటిల్స్ అందజేత

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని మెంట్రాజ్ పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థులకు ఏ.ఆర్.బి కిడ్స్ వరల్డ్ ఫౌండర్ అల్లుళ్ల అనిల్ విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్నులు, వాటర్ బాటిల్స్ బహూకరించారు. ఈ నెల 18 నుండి పదవ తరగతి బోర్డ్ ఎగ్జామ్స్ రాయబోతున్న విద్యార్థులకు పలు సలహాలు, సూచనలు అందజేశారు. గ్రామానికి, గురువులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని వివరించారు. అనంతరం అలుళ్ళ అనిల్‌ను ప్రధానోపాధ్యాయులు రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మెంట్రాజ్ పల్లి తాజా మాజీ ఉపసర్పంచ్ రెడ్డిపల్లి రాజలింగం, కింగ్ ఆఫ్ కింగ్స్ మినిస్ట్రీస్ ప్రెసిడెంట్ ఇస్రాయెల్, కానిస్టేబుల్ ఆనంద్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చెరువులోపడి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-ఎడపల్లి



మండలంలోని మంగల్‌పాడ్ గ్రామానికి చెందిన దేగామ లక్ష్మణ్(50) గ్రామ ఊర చెరువులో దూకి ఆత్మహత్య చేసకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. చెరువు కట్టపై చెప్పులు, సైకిల్, టిషర్ట్ పెట్టి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. బుధవారం రాత్రి వరకు జాలర్లు గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ లక్ష్మణ్ మృతదేహం దొరకలేదు. కుటుంబీకులు, గ్రామస్తులు కలిసి బీహార్‌కు చెందిన జాలార్లను పిలిపించారు. గురువారం తెప్ప సహాయంతో చెరువులో గాలింపు చర్యలు చేపట్టగా చివరికి లక్ష్మణ్ మృతదేహం లభ్యమయింది. పోలీసులు అక్కడికి చేరుకొని శవ పంచామ నిర్వహించారు. భార్య నర్సు బాయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-బోధన్


పాలాభిషేకం చేస్తున్న నాయకులు

పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గురువారం ఉమ్మడి బోధన్ మండలాలకు చెందిన మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మున్నూరుకాపు సంఘం మండల అధ్యక్షులు, హూన్స సొసైటీ చైర్మన్ రవి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మున్నూరుకాపుల అభివృద్ధి కోసం "మున్నూరుకాను కార్పొరేషన్"ను ఏర్పాటు చేయడానికి క్యాబినెట్ ఆమోదం చేయించడం హర్షించదగ్గ విషయమన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా కులాల అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక కార్పొరేషన్లను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో బోధన్ మండల మున్నూరుకాపు నాయకులు పీసీసీ డెలిగేట్ గంగాశంకర్, ప్రధాన కార్యదర్శి భవానీపేట గంగాధర్, పట్టణ అధ్యక్షులు బీర్కూర్ బుజ్జి, యేశాల రవి, బీర్కూర్ అజయ్, పల్లె గంగారాం, ఉమ్మడి బోధన్ మండలం, పట్టణ మున్నూరుకాపు కార్యకర్తలు పాల్గొన్నారు.

సాలూర మండల కేంద్రంలో..

మండల కేంద్రంలోని బసవేశ్వర విగ్రహం వద్ద లింగాయత్ సమాజ్ సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి చిత్రపటాలకు లింగాయత్ సమాజ్ సంఘం నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సంధర్బంగ వారు మాట్లాడుతూ.. ఉమ్మడి బోధన్ మండల సాలురా మండల లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి "లింగాయత్ కార్పొరేషన్" ఏర్పాటు చేసినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో సాలూర సురేష్ పటేల్, మాజీ ఎంపీటీసీ చీల శంకర్, కంటే రాజు, లింగాయత్ అధ్యక్షుడు శంకర్, కల్దుర్కి ప్రకాష్ పటేల్, బీహారి హన్మంత్, సిద్ధపూర్ అశోక్ పటేల్, జయరాం పటేల్, శంకర్, అక్షయ్ పటేల్, రాజు పటేల్, శివరాజ్ పాటెల్, అర్జున్ పటేల్, ఉమ్మడి బోధన్ మండల లింగయత్ సమాజ్ సభ్యులు పాల్గొన్నారు.


అవార్డు అందుకుంటున్న ప్రమీలరాణి

ఉత్తమ సూపర్వైజర్‌గా ప్రమీల రాణికి అవార్డు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని ఐసిడిసి సూపర్వైజర్ ప్రమీలరానికి రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డు లభించింది. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క చేతులమీదుగా అవార్డును అందుకున్నారు. జిల్లా నుంచి ఆర్మూర్ సిడిపిఓ స్వర్ణ, అంగన్వాడీ కార్యకర్త గంగాజమునకు అవార్డులు అందజేయడం జరిగింది. ఉత్తమ సూపర్వైజర్‌గా అవార్డును అందుకున్న ప్రమీలరాణికి మండలంలోని అంగన్వాడి కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆమె మరిన్ని అవార్డులను అందుకోవాలని అన్నారు. చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందజేయడానికి ఆమె చేస్తున్న కృషి అభినందనీయమని వారు కొనియాడారు.

రూపాయి అభివృద్ధి చేయని అరవింద్

- ఈసారి బాజిరెడ్డి గోవర్ధన్‌ను ఎంపికగా గెలిపిద్దాం
- ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

జిల్లా ప్రజలు ఎన్నో ఆశాలు, ఆకాంక్షలు పెట్టుకుని భారీ మెజార్టీ ఇచ్చి గెలిపించిన బిజెపి ఎంపి ధర్మపురి అర్వింద్ మండలానికి గత ఐదేళ్ల కాలంలో రూపాయి కేటాయించిన దాఖలాలు లేవని ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్ అన్నారు. పలు పర్యాయాలు ఎమ్మెల్యేగా చేసిన బాజిరెడ్డి గోవర్ధన్ కోట్లాది రూపాయలతో నియోజకవర్గానికి అభివృద్ధి చేశారని తెలిపారు. ఈ సారి బీఆర్ఎస్ అధినేత కెసిఆర్ నిజామాబాద్ జిల్లా నుండి బిఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా టికెట్ కేటాయించిందని అన్నారు. గురువారం ఇందల్‌వాయి, డిచ్‌పల్లి మండల కేంద్రాల్లో ఎంపీ టికెట్ కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తు టపాకులు కాల్చి స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ బదావత్ రమేష్ నాయక్, మండల అధ్యక్షులు చిలువేరి గంగదాస్, సీనియర్ నాయకులు శక్కరికొండ కృష్ణ మాట్లాడుతూ.. బాజిరెడ్డి గోవర్ధన్ గెలుపునకు నియోజకవర్గం లోగల బీసీకులాలు అందరు మద్దతు తెలిపి పార్లమెంటు ఎన్నికల్లో భారీ మెజార్టీని అందించాలని కోరారు. కార్యక్రమంలో చింతల పల్లి గోవర్ధన్ రెడ్డి, ఎంపీటీసీ చింతల దాస్, మారంపల్లి సుధాకర్, కో ఆప్షన్ సభ్యులు షేక్ హుస్సేన్, నయీమ్, బీరీష్, నామాల గంగారాం, కచ్చకాయల శ్రీనివాస్, శ్రీనివాస్, జిల్లా సీనియర్ నాయకులు నీరడి పద్మారావు, ఓడ్డం నర్సయ్య, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

స్నానానికి వెళ్లి యువకుడు మృతి

నవతెలంగాణ-ఎడపల్లి



నిజాంసాగర్ కెనాల్లో స్నానానికి వెళ్లిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు మృతిచెందాడు. గోపరి నవీన్ (20), దుబాస శ్రీకాంత్ అనే ఇద్దరు గురువారం మండలంలోని వడ్డేపల్లి గ్రామ సమీపాన గ్రామ సమీపానగల నిజాంసాగర్ డి-46 కాలువలో స్నానం చేయడానికి వెళ్లారు. ఇరువురు స్నానం చేస్తుండగా గోపరి నవీన్ నీళ్ల తాకిడికి దూరంగా కొట్టుకుపోయి మృతిచెందాడు. అది గమనించిన దుబాస శ్రీకాంత్ అనే యువకుడు ఎడపల్లి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి జరిగిన ఘటనను పోలీసులకు తెలిపారు. పోలీసులు పంచనామా నిర్వహించి, పోస్టు మార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై భూపెల్లి విక్రమ్ తెలిపారు.

విద్యార్థుల సమగ్ర వికాసానికి గణితశాస్త్రమే ప్రామాణికం

నవతెలంగాణ-సిరికొండ

గణితం మానసిక క్రమశిక్షణను పెంపొందించడానికి సమర్థవంతమైన మార్గాన్ని అందిస్తుందని, మానసిక దృఢత్వాన్ని ప్రోత్సహిస్తుందని విద్యార్థుల సమగ్ర వికాసానికి గణితశాస్త్రమే ప్రామాణికమని సత్యశోధక్ ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య అన్నారు.గురువారం అంతర్జాతీయ గణిత దినోత్సవంపై (జూ) దినోత్సవాన్ని నిర్వహించినట్టు తెలిపారు. విద్యార్థులు 3.14 మరియు పై (జూ) ఆకృతిలో కూర్చొని గణితశాస్త్ర ఆకాంక్షను తెలియపరిచారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య మాట్లాడుతూ గణితశాస్త్రంలో ప్రముఖ స్థానాన్ని కలిగి ఉండే వివిధ భావనలలో ఒకటి పై (జూ) అని, వృత్తం యొక్క చుట్టుకొలత దాని వ్యాసం యొక్క గణిత నిష్పత్తి. వృత్తం యొక్క వైశాల్యాన్ని గణించడంలో ఇది ముఖ్యమైన స్థిరాంకమని, దీని విలువ 3.14159 అని అందువలన మార్చ్ 14న పై (జూ) మరియు అంతర్జాతీయ గణిత దినోత్సవం జరుపుతారన్నారని అన్నారు. గణితశాస్త్ర ప్రాముఖ్యత గుర్తించి ప్రోత్సహించుటకు మేధావులు, గణిత ఔత్సహికులు చేస్తున్న కృషి వెల కట్టలేనిదన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష అట్టల పంపిణీ

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష అట్టలు, జామెట్రీ బాక్సులు, పెన్నుల వితరణ చేయడం జరిగిందని ప్రధానో పాధ్యాయులు దొంతుల రవీందర్ తెలిపారు. పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి విచ్చేసి 25 మంది విద్యార్థులకు పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో విడిసి అధ్యక్షులు మేడిదాల ప్రవీణ్‌గౌడ్, సవీన్, సల్ల చిన్న రాజన్న, ఉపాధ్యాయులు మోతే మోహన్, విటల్, శోభ, విజయలక్ష్మి, శారద, సంగీత, లావణ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రొసీడింగ్ కాపీలు అందజేత

- ఎంపీ చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి


ప్రొసీడింగ్ కాపీలు అందజేస్తున్న ఎమ్మెల్యే

రాజ్యసభ సభ్యులు ఎంపీ సంతోష్‌కుమార్ నిధుల నుంచి వేల్పూర్ మండల కేంద్రంలోని వివిధ అభివృద్ధి పనుల కొరకు మంజూరైన రూ.1.93కోట్ల నిధుల ప్రొసీడింగ్ కాపీలను మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అందజేశారు. ఈ మేరకు గురువారం వేల్పూర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో గ్రామాభివృద్ధి కమిటీ, ఆయా సంఘ కమిటీ సభ్యులకు నిధుల మంజూరు పత్రాలను ఆయన అందజేశారు. వేల్పూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు రూ.1.03 కోట్లు, వేల్పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.25లక్షలు, వేల్పూర్ ఇండోర్ స్టేడియం పనుల కోసం రూ.35 లక్షలు, ముదిరాజ్ సంఘం రూ.20లక్షలు, మజీద్ వద్ద టాయిలెట్స్ నిర్మాణం కోసం రూ.2లక్షలు, ఆల్ క్రిస్టియన్ గ్రేవ్ యార్డ్ నిర్మాణం కోసం రూ.5లక్షలు, కొనసముందర్ సింగిల్ విండో గోడౌన్ నిర్మాణం కోసం రూ.10లక్షలు, కమ్మర్ పల్లి సింగిల్ విండో గోడౌన్ నిర్మాణంకు రూ.10లక్షలు, ముప్కాల్ మండలం కొత్తపల్లి గ్రామ మహిళ భవనం అదనపు పనుల కోసం రూ.4లక్షలు, మెండోరా మండలం కోడిచెర్ల గ్రామం మహిళ భవనం అదనపు పనుల కోసం రూ.6లక్షలు మంజూరు చేస్తూ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వేల్పూర్ గ్రామ ప్రజల తరపున, కమిటీ సభ్యులు, వేల్పూర్ బిఆర్ఎస్ పార్టీ తరపున ఎంపి సంతోష్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

అనాథాశ్రమ విద్యార్థినికి పెళ్లికానుకలు అందజేత



నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలోని అమ్మ అనాథాశ్రమ విద్యార్థిని (సోనీ) కి ఈ నెల 17న వివాహం నిశ్చయం కావడంతో కోటగిరి అభయ హస్తం ఫౌండే షన్ సభ్యులు బర్ల మధు, చీరలు, ఆభరణాలు మొదలగు పెళ్ళికానుకులను గురువారం అందజేశారు, అమ్మ అనాథాశ్రమ నిర్వాహకురాలు వెంకటరమణమ్మ ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-మోర్తాడ్

మండలంలోని దొనకల్ గ్రామానికి చెందిన మాడవేటి శివరాజ్, మాడవేటి రవి తండ్రి కొడుకులు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా బాధ్యత కుటుంబాన్ని బాల్కొండ నియోజకవర్గ ఇన్చార్జి ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి గురువారం పరామర్శించారు. ఘటన విషయాలు తెలుసుకొని బాధ్యత కుటుంబానికి సంతాపాన్ని తెలియజేశారు. పార్టీ మండల అధ్యక్షులు రాములు, కమ్మర్‌పల్లి మండల అధ్యక్షుడు రవి, శేఖర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి రూ 92.65లక్షలు

- బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

బాల్కొండ నియోజకవర్గంలో ఈ వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూసేందుకు తాగునీటి పైప్ లైన్ల మరమ్మత్తుల కోసం తక్షణం రూ.92.65 లక్షల నిధులను ప్రభుత్వం ప్రత్యేక అభివృద్ధి నిధుల నుండి మంజూరు చేసినట్లు బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మెండోర మండలకేంద్రానికి రూ.7.50 లక్షలు, ముప్కాల్ మండలం వెంచిర్యాల్ గ్రామానికి రూ.లక్ష, మోర్తాడ్ మండల కేంద్రానికి రూ.75 వేలు, ఏర్గట్ల మండలంలోని బట్టాపూర్ కు రూ.1.25 లక్షలు, తడపాకల్ కు రూ.1.75 లక్షలు, ఏర్గట్లకు రూ.75వేలు, తొర్తికి రూ. లక్ష, కమ్మర్‌పల్లి మండలంలోని కొత్తచెరువు తండాకు రూ.80వేలు, కమ్మర్ పల్లికి రూ. 3.50 లక్షలు, చౌట్‌పల్లికి రూ.లక్ష, హాస కొత్తూర్ కు రూ.1లక్ష, ఇనాయత్ నగర్‌కు రూ.30వేలు, దొమ్మరి చౌడు తండాకు రూ.50వేలు, అమీర్ నగర్‌కు రూ.50వేలు, బాల్కొండ నియోజకవర్గంలోని రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల కు రూ.11లక్షలు మంజూరయ్యాయి. వేల్పూర్ మండలంలోని అంక్సాపూర్ కు రూ.75వేలు, అక్లూర్‌కు రూ.50వేలు, పోచంపల్లికి రూ.50వేలు, పడగల్ ఒడ్డేర కాలనికి రూ.30వేలు, భీంగల్ మండలంలోని పాత తాండకు రూ.8.50లక్షలు, రాహత్ నగర్ కు రూ.14.50 లక్షలు, తాళ్ళపల్లికి రూ.29లక్షలు, బెజ్జొరకు రూ.2లక్షలు, గోన్ గొప్పులకు రూ2లక్షలు, లింగాపూర్ కు రూ.2లక్షలు ప్రభుత్వం ప్రత్యేక అభివృద్ధి నిధుల నుండి మంజూరు చేసింది. గత ప్రభుత్వం పట్టించుకోకుండా వదిలేసిన పైప్ లైన్ల మరమ్మత్తులను ప్రస్తుతం మంజూరైన నిధుల ద్వారా తక్షణం మరమ్మత్తులు చేసి తాగునీటి సమస్యను తీర్చాలని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ రూరల్ వాటర్ సప్లై అధికారులకు సూచించారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్య ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండకూడదని ఆయన తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండలంలోని మాల్ తుమ్మెద మంజీర నది నుండి బుధవారం రోజు రాత్రి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజు గురువారం తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ట్రాక్టర్లను సీజ్ చేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు.



పట్టుకున్న ఇసుక ట్రాక్టర్‌లు

ఘనంగా స్వయంపాలన దినోత్సవం

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని వదలపర్తి గ్రామంలో గల ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. 7వ వతరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠ్యాంశాలను ఇతర తరగతి విద్యార్థులకు బోధించారు. ప్రధానోపాధ్యాయుడిగా పరమళ్ళ సాత్విక్. ఉపాధ్యాయులుగా సాయిరాం, బన్నీ, మహేష్, సందీప్, సింధు, శరణ్య, నందు, అర్చన, సంపూర్ణ విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కరుణాకర్, ఉపాధ్యాయులు శార్వాణి, భాగ్యలక్ష్మి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



స్వయంపాలన దినోత్సవంలో విద్యార్థులు

రూటు మార్చి రాటుదేలారు

- వేరు శనగ సాగుపై రైతుల ఆసక్తి

నవతెలంగాణ-జుక్కల్

మండలంలో రైతులు శనగ పంట సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. గతంలో వేల ఎకరాలలో పండించేవారు. తరువాతీ కాలంలో పంటను వందల ఎకరాలకు పరిమితం అయింది. ఒకప్పుడు వేరుశెనగ పంట విరివిగా పండించిన రైతులు ఇరువై ఎండ్లుగా పంట కనుమరుగై పోయింది. అక్కడక్కడా రైతులు పండించేవారు. ప్రస్తుతం గత రెండు మూడేళ్లుగా రైతులు వేరుశెనగ పంట వైపు మొగ్గు చూపుతున్నారు. ఒకరికి ఒకరు పండించే విదానాలను నయాపద్ధతిలో మల్చింగ్ విదానంలో అధిక దిగుబడి సాదించేందుకు చూసి పంటను పండించేందుకు ఆసక్తిగా ముందుకు వచ్చారు. దీనికి తోడు మార్కెట్‌లో వేరశెనగకు మంచి ధర పలుకుతోంది. పచ్చిపల్లి కూడా మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండటం, వైద్యులు వేరుశెనగ నూనేను వాడాలని హృదయ రోగులకు సూచించడంతో పట్టణాలలో మంచి డిమాండ్ నెలకొంది.

పచ్చిపల్లి కాయకు మంచి డిమాండ్

మార్కెట్‌లో పచ్చిపల్లి కాయకు ప్రజలు చాల ఇష్టంగా వాడుతుంటారు. ప్రయాణ యమయంలో కాల్చిన పల్లికాయ టెస్టే వేరుగా ఉంటుంది. ఎక్కడ జన సంచారం ఉన్న అక్కడ పల్లిలు అమ్మేవారు ఉంటారు. దీంతో పాటు మంచి పౌష్టక ఆహారంగా కూడా ఉంటుంది.



మార్కెట్ సదుపాయలు లేవు..

జుక్కల్ ప్రాంతంలో మార్కెట్ సదుపాయం లేకపోవడంతో మహరాష్ట్ర, కర్ణాటక ప్రాంత నగరాలలో మార్కేట్‌కు తరలిస్తారు. కొంత మంది రైతులు నూనే గానుగ అడించే వారికి, దళారులకు అమ్మేస్తుంటారు.

ఖర్చు ఎక్కువే..

వేరుశెనగ పంటను పండించే రైతు ఎకరాకు నలుపై నుంచి యాబై వేలు ఖర్చు పెట్టాల్సిందే. క్వింటాల్ పల్లి విత్తనం రేటు పదహేను వేలు ఉంది. వీటితో పాటు ఇతర ఖర్చులు పట్టుకుని సుమారుగా బాగానే ఖర్చులుంటాయి.

పల్లిపంట సాగు పెరిగింది

పల్లి పంట సాగు గతం కంటే పెరిగింది. ఇరువై ఎండ్ల క్రితం విరివిగా పండించే వారు. మధ్యలో గ్యాప్ వచ్చింది. ఆధునిక శాస్త్ర విధానలను అందిబుచ్చుకుని ప్రస్తుతం విద్యావంతులైన యువ రైతులు పంచల సాగు బాగానే చేయడం గమానర్హం.

తైబజార్ వేలంలో పోటాపోటీ



వేలం పాట పాడుతున్న పలువురు

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్ర మేజర్ గ్రామపంచాయతీ తైబజార్ వేలం పాట గురువారం గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి డాక్టర్ బండి వార్ విజయ్ అధ్యక్షతన గ్రామపంచాయతీ కార్యదర్శి సందీప్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రూ.50వేల చొప్పున డిపాజిట్లు పెట్టినప్పటికీ ఇద్దరి మధ్యనే వేలంపాట పోటాపోటీగా సాగింది. నేనంటే నేనే సాధించుకునే విధంగా వేలం పాట సాగింది. పాకల్ వార్ శివ లింగు మరొకరు అవర్ వార్ హనుమాన్లు మధ్య సాగిన వేలంపాట చివరిగా రూ.13లక్షల 11వేలకు హనుమాన్లు దక్కించుకున్నారు. గురువారం కొనసాగిన తైబజార్ వేలంలో గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.2లక్షల 89వేలు అధికంగా పలికింది. గ్రామపంచాయతీకి అత్యధికంగా ఆదాయం రావడానికి ఆ ఇద్దరి మధ్య పోటీపడ్డ వారికి గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి డాక్టర్ విజయ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి సందీప్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ వేలం పాట చూడడానికి చాలామంది గ్రామస్తులు హాజరయ్యారు.

ఘనంగా శ్లోక ఇన్నోవేటివ్ పాఠశాల ప్రథమ వార్షికోత్సవం

- ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు



మాట్లాడుతున్న విద్యానంద స్వామి

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లా కేంద్రంలోని వాసవినగర్‌లో గల శ్లోక ఇన్నోవేటివ్ పాఠశాల ప్రథమ వార్షికోత్సవ వేడుకలను శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన శ్రీ వేదగిరి విద్యానంద స్వామి వేదభారతి పీఠం బాసర, కామారెడ్డి డిఈఓ రాజు, ఎంఈఓ ఎల్లయ్యలు మాట్లాడుతూ.. పాఠశాల సెక్రటరీ కరస్పాండెంట్ జాలిగామ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పాఠశాలలో అత్యున్నత విలువలతో కూడిన విద్యాబోధనను అందిస్తున్నారని, విద్యార్థులలో నూతన ఆలోచనలను రేకెత్తించే విధంగా కార్యక్రమాలను నిర్వహిస్తూ విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమని అన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంస పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాజీ విప్‌ను కలిసిన జహీరాబాద్ అభ్యర్థి



మాజీ విప్‌ను సన్మానించిన గాలి అనిల్‌కుమార్

నవతెలంగాణ-కామారెడ్డి

బీఆర్ఎస్ నుంచి జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్న గాలి అనిల్‌కుమార్ గురువారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో మాజీ విప్ గంప గోవర్ధన్ నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కామారెడ్డి నియోజకవర్గ పరిస్థితిపై కొద్దిసేపు చర్చించారు. ఎలాగైనా ఎంపీ అభ్యర్థిగా గెలిపించాలని గాలి అనిల్‌కుమార్ కామారెడ్డి నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను కోరారు. బిఆర్ఎస్ పార్టీ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు యంకె.ముజీబోద్దీన్ మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో 47వ వార్డు కౌన్సిలర్ గేరిగంటి సప్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు అట్టలు పంపిణీ



నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని మర్కల్ ఉన్నత పాఠశాల లో గురువారం పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష అట్టలతో పాటు పెన్నులు పెన్సిల్ రబ్బరు తదితర వస్తువులను యస్ఆర్‌కే డిగ్రీ కాలేజీ లెక్చరర్ అరకంతం బాల్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు బాగా రాసి తల్లితండ్రులకు పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు తేవాలని సూచించారు.

పరీక్ష అట్టలు పంపిణీ

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట మండలంలోని గోపాల్‌పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం రోజు విజయ స్ఫూర్తి కార్యక్రమంలో భాగంగా పరీక్ష అట్టలు పంపిణీ చేసినట్లు ఎం ఈ వో వెంకటేశం తెలిపారు. కార్యక్రమంలో డివిజనల్ ఆఫీసర్ శ్రీనివాసరావు. స్థానిక ఎస్ఐ రాజు. ప్రధానోపాధ్యాయులు వెంకట్రంరెడ్డి తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లు ప్రకటించడం పట్ల హర్షం

నవతెలంగాణ-పిట్లం/నాగిరెడ్డిపేట్/కామారెడ్డి

తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ముదిరాజ్ కార్పొరేషన్ ప్రకటించిన నేపథ్యంలో గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ క్యాబినెట్ నిర్ణయించిన ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు పట్ల హర్షం వ్యక్తం చేశారు. అలాగే గత అసెంబ్లీ ఎన్నికల లో హామీ ప్రకారం ముదిరాజ్ లను బిసి ' డి ' నుండి బిసి ' ఏ ' లోకి త్వరలో మార్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ముదిరాజ్ సంగం ఉపాధ్యక్షులు మార్గం పండరి , కార్యదర్శి తుపాకుల సుధాకర్ , మేకల విట్టల్ , అఖిల్ సాయి బాలు , గుంట హన్మాండ్లు , నాగంపల్లి కృష్ణ , బలరాం , కేశన్న తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట్ : నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో గల మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గురువారం సీఎంతో పాటు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు చిత్రపటాలకు రెడ్డి సంఘం ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వానికి పలుమార్లు రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోలేదని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గవర్నమెంట్ రావడంతో అందరికీ సమానంగా చూసే కాంగ్రెస్ ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడంపై ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్, నాగిరెడ్డిపేట్ రెడ్డి సంఘం మండల అధ్యక్షులు కాంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి తాండూర్ సొసైటీ చైర్మన్ ఆకిడి గంగారెడ్డి, నరసింహారెడ్డి, వాసు రెడ్డి, వెంకట్ రెడ్డి, నరేందర్ రెడ్డి, జగన్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, నారాయణరెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు షాహిద్ పాషా పాల్గొన్నారు.



సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం

కార్పొరేషన్ల ఏర్పాటు స్వాగతిస్తున్నాం

కామారెడ్డి : మంత్రి మండలి సమావేశంలో బీసీ కులాలకు 16 కార్పొరేషన్లను ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం కామారెడ్డి జిల్లా అధ్యక్షులు చింతల శంకర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బీసీ మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి మండలికి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్థికంగా వెనకబడిన బీసీలకు, మాదిగ, మాదిగ ఉప కులాల, మాల, మాల ఉప కులాలకు కార్పొరేషన్లను ఏర్పాటు చేయడం సంతోషం అని అందుకు మంత్రి మండలిని అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు. గిరిజనుల కోసం మూడు ప్రత్యేక కార్పొరేషన్లను ఏర్పాటు చేసినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కార్పొరేషన్లను ఏర్పాటు చేయడమే కాదు వాటికి తగిన నిధులను సమకూర్చాలని, బడుగు బలహీన వర్గాల ప్రభుత్వంగా ఉండాలని ప్రకటనలో పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కులగనన చేపట్టి బీసీలకు తగు న్యాయం చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరుతున్నామని, మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించారని దాంట్లో బీసీలకు సబ్ కోటా పెట్టేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

గతగత ప్రభుత్వంలో ఎంబీసీ కార్పొరేషన్ రూ.1000 కోట్లు కేటాయించిన ఒక్క రూపాయి కూడా ఖర్చు చేసిన పాపాన పోలేదని పేర్కొన్నారు. ఏదో నామ్కే వాస్తే బీసీలకు ఎక్కడో ఒకరికి లక్ష రూపాయల బీసీ బంధు ఇచ్చి చేతులు దులుపుకున్నది గత ప్రభుత్వం లాగా కాకుండా బీసీలను కడుపులో పెట్టి చూసుకోవాల్సిందిగా ఈ ప్రభుత్వాన్ని మేము అభ్యర్థిస్తున్నాం అనీ ప్రకటనలో పేర్కొన్నారు.

ఏండ్ల కల ఫలించింది

- మున్నూరు కాపుల హర్షం



తోట అనూయలక్ష్మీనారాయణను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-బిచ్కుంద

మండలంలోని వాజీద్‌నగర్ గ్రామంలోని మున్నూరు కాపు సంఘం ప్రాంగణంలో జుక్కల్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు తోట అనూయలక్ష్మీనారాయణను సంఘం సభ్యులు సన్మానించారు. ముందుగా మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు గాను వాజీద్‌నగర్, పుల్కల్, దేవాడ, బండరెంజల్ గ్రామాలలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం అధ్యక్షురాలు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న కార్పొరేషన్ ఏర్పాటు కల ఫలించిందని అన్నారు. మున్నూరు కాపులు అంటేనే సేవాదాతలని కుల వృత్తిగా ఉన్న వ్యవసాయాన్ని నమ్ముకొని దేశ ప్రజల కడుపు నింపుతున్న మున్నూరు కాపుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరింత చేయుత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గం కోఆర్డినేటర్ గుండమొగులయ్య, వాజిద్‌నగర్, పుల్కల్, దేవాడ, బండారేంజల్ అధ్యక్షులు కుంటెల్లప్పగంగారాం, మనోహర్, గంగారం, మారాజు గంగారం, మండల కార్యదర్శి బుడాల శ్రీను ఆయా గ్రామాల మున్నూరు కాపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

నవతెలంగాణ-బిచ్కుంద

మండలంలోని బండరేంజల్ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ రూ.20లక్షల నిధులతో నూతనంగా నిర్మించే గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి జుక్కల్ శాసనసభ్యులు తోటలక్ష్మీకాంతారావు భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలను ఎమ్మెల్యే కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బండరేంజల్ పెద్ద గ్రామ పంచాయతీ అయినప్పటికీ ఇప్పటివరకు పంచాయితీ భవనం లేకపోవడం దురదృష్టకరమని అన్నారు. గ్రామానికి రావాల్సిన రూ.55లక్షల పెండింగ్ నిధులను మంజూరు చేయించడానికి తాను కృషి చేస్తానని బండరేంజల్ గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి మొదటి విడతలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా తాను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి జుక్కల్ నియోజకవర్గం అభివృద్ధిలో చాలా వెనకబడిందని ఇప్పటి వరకు గత పాలకులు నియోజకవర్గంలో ఒక్క డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించలేదనీ కోటా పెంచాలని విజ్ఞప్తి చేయగా సానుకూలంగా స్పందించారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు ధర్పల్లి గంగాధర్, పిసిసి డెలిగేట్ విట్టల్‌రెడ్డి, మాజీ జెడ్పీటిసి మున్నూరు నాగనాథ్, మాజీ సర్పంచ్ గడ్డం బాల్రాజ్, మాజీ ఏఎంసి చైర్మన్ నాగనాథ్ పటేల్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఇంటి పన్నులు 100 శాతం వసూలు చేయాలి

- జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు



సమావేశంలో మాట్లాడుతున్న డిపిఓ

నవతెలంగాణ-భిక్కనూర్

ప్రతి గ్రామపంచాయతీలో 100 శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గురువారం భిక్కనూరు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున నెల చివరి వరకు 100 శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని, వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ అభివృద్ధి పనుల ప్రణాళిక తయారుచేసి పూర్తి వివరాలు ఆన్ లైన్ లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి శ్రీనివాస్, ఎంపీఓ ప్రవీణ్ కుమార్, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

మూల్యాంకన విధుల్లో విధిగా పాల్గొవాలి

- లేకుంటే శాఖపర చర్యలు
- మూల్యాంకన క్యాంప్ అధికారి రవికుమార్
- ఇంటర్ పరీక్షపత్రాల మూల్యాంకన ప్రారంభం


నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఇంటర్ మూల్యాంకన కేంద్రంలో ఇంటర్ జవాబు పత్రాలు మూల్యాంకనం ప్రారంభమైందని జిల్లా ఇంటర్మీడియట్ మూల్యాంకన కేంద్రం క్యాంపు అధికారి రవికుమార్ గురువారం తెలిపారు. ఇదివరకే సంస్కృతం మూల్యాంకనం ప్రారంభమైందని తెలిపారు. శనివారం 16వ తేదీ నుండి తెలుగు, హిందీ, ఇంగ్లీషు, గణితము, పౌర శాస్త్రము సబ్జెక్టల మూల్యాంకనం ప్రారంభం కానుందని తెలిపారు. ఈ మూల్యాంకనంలో పాల్గొనాల్సిన అధ్యాపకులకు ఇదివరకే ఆయా కళాశాలల లాగిన్లలో నియామక పత్రాలను ఇంటర్ బోర్డు నిక్షిప్తం చేసిందని తెలియజేశారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల, ప్రైవేట్, ఎయిడెడ్ జూనియర్ కళాశాలలో, సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల లు, మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలలో, కేజీబీవీ కళాశాలల లో, మైనారిటీ రెసిడెన్షియల్ కళాశాలలో, బిసి రెసిడెన్షియల్ కళాశాలలో ఇతర అన్ని జూనియర్ కళాశాలలో వెంటనే ఆయా కళాశాలల ప్రిన్సిపాల్ లు మూల్యాంకన విధులు కేటాయించబడిన అధ్యాపకులను తమ విధుల నుండి రిలీవ్ చేసి మూల్యాంకన కేంద్రంలో పాల్గొనేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మూల్యాంకన విధులకు అధ్యాపకులను రిలీవ్ చేయని ప్రిన్సిపాల్‌లపై , రిలీవ్ చేసినా విధులలో పాల్గొనని అధ్యాపకులపై శాఖ పరమైన చర్యలు తీసుకోవడానికి ఇంటర్ బోర్డు సిద్ధంగా ఉందని స్పష్టంచేశారు. కావున అధ్యాపకులు అందరూ తమకు కేటాయించిన మూల్యాంకన సబ్జెక్టుల లో శనివారం రిపోర్టు చేయాలని ఆదేశించారు. మూల్యాంకనం విధులలో పాల్గొనని అధ్యాపకుల విషయంలో ఇంటర్ బోర్డు గతంలో జరిమానాలు విధించిన విషయం తెలిసిందేనని ఈ సందర్భంగా సూచించారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో ప్రవేశాలకు లక్కీడ్రా

నవతెలంగాణ-కామారెడ్డి

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 1వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న వారికి ప్రవేశాలు కల్పించేందుకు కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సమక్షంలో గురువారం లక్కీ డ్రా నిర్వహించారు. ముగ్గురు బాలికలు.. పాల్య నందిని, కేతావత్ అశ్విని, బాణావత్ సహస్ర తో పాటు ఇద్దరు బాలురలు కారంతోడ్ వరుణ్, దేవసోత్ రుత్విక్‌లను లక్కీ డ్రా ద్వారా ఎంపిక అయ్యారు. కార్యక్రమంలో ఇంఛార్జి గిరిజన అభివృద్ధి అధికారి జి.రజిత, అధికారులు, ఇద్దరు ప్రధానోపాధ్యాయులు సాయిరెడ్డి, లక్ష్మీనారాయణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



లక్కీ డ్రా తీస్తున్న చిన్నారి

బీఆర్ఎస్‌లో రాజీనామాల పర్వం..

- తాజాగా సర్పంచ్‌ల ఫోరం తాజా మాజీ మండల అధ్యక్షులు బీఆర్ఎస్‌కు రాజీనామా

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తాజా మాజీ సర్పంచ్ల ఫోరం ఇందల్ వాయి మండల అధ్యక్షులు లోలం సత్యనారాయణ బీఆర్ఎస్‌కు గురువారం రాజీనామా చేసి నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, బిజెపి జిల్లా అధ్యక్షులు కులచారి దినేష్ కూమార్ సమక్షంలో బిజెపీలో చేరారు. సత్యనారాయణ మాట్లాడుతూ బిఅర్ఎస్ పార్టీ లో కొందరు నాయకుల తీరుతో విసుగు చెందానని, చివరికి మనస్థాపం చేసింది రాజినామా చేసినట్లు వివరించారు. ప్రదానమంత్రి నరేంద్ర మోడీ విధానాలు నచ్చి బిజెపి లో 35మందితో కలిసి చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు నాయిడి రాజన్న, గ్రామ శాఖ అధ్యక్షులు పి రవి,జె శ్రీనివాస్ పాల్గొన్నారు.